11వ వార్షికోత్సవ శుభాకాంక్షలు
ప్రకటన కర్తలకు,పాఠకులకు, తెలుగు ప్రజలకు, మిత్రులకు, శ్రేయోభిలాషులకు పెన్‌పవర్ వారి

# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక — PEN POWER TELUGU DAILY — ప్రశ్నించడం మన హక్కు

సంపుటి : 1 సంచిక : 77 పేజీలు :8 | సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) | ప్రచురణ : కడప | ఆదివారం 23 నవంబర్ 2025 | వెల : 5/-రూ ॥

VOLUME :1 ISSUE : 77 PAGES :8 | EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) | PUBLISHED :KADAPA | SUN 23 NOVEMBER 2025 | PRICE : 5/- RS

Simultaneously Published form Kadapa, Narasarao Peta,Bapatla,Ongole,Visakhapatnam,Kakinada, Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari,West Godavari,Eluru,Guntur,SPSR Nellore,Tirupati,Chittor,Kurnool,Anantapur

# సత్యసాయి సేవలు చిరస్మరణీయం

## రాష్ట్రపతి ముర్ము, సీఎం చంద్రబాబు

- పుట్టపర్తిలో సత్యసాయి శత జయంతి వేడుకలు
- ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్రపతి ద్రౌపది ముర్ము
- మానవ సేవే మాధవ సేవ అని బాబా చాటారన్న ముర్ము
- బాబా బోధనలు ప్రపంచ శాంతికి దోహదపడతాయన్న సీఎం చంద్రబాబు
- మానవ సేవలో సత్యసాయి ట్రస్ట్ ఆదర్శనీయమన్న నేతలు
- ట్రైబల్ ఉమెన్ హెల్త్ కేర్ కార్యక్రమం ప్రారంభం



పెన్ పవర్ డెస్క్:శ్రీ సత్యసాయి బాబా నిరంతరం బోధించిన సత్యం, ధర్మం, శాంతి, ప్రేమ వంటి మార్గాలు అనుసరణీయ మని, లోక కల్యాణం కోసమే ఆయన పాటుపడ్డారని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అన్నారు. పుట్టపర్తిలో జరుగుతున్న సత్యసాయి బాబా శత జయంతి ఉత్సవాల్లో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబుతో కలిసి ఆమె సత్యసాయి మహాసమాధిని దర్శించుకున్నారు. అంతకుముందు విమానాశ్రయంలో రాష్ట్రపతికి సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్, ఇతర అధికారులు ఘన స్వాగతం పలికారు.

**లోక కల్యాణమే సత్యసాయి లక్ష్యం: రాష్ట్రపతి ద్రౌపది ముర్ము**

ఈ వేడుకల్లో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము మాట్లాడుతూ.. "సత్యసాయి జయంతి ఉత్సవాల్లో పాల్గొనడం నా భాగ్యం. 'మానవ సేవే మాధవ సేవ' అని నమ్మిన మహానుభావుల్లో ఆయన అగ్రగణ్యులు. సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ జాతి నిర్మాణం కోసం విశేష కృషి చేస్తోంది. ఆయన స్ఫూర్తితో ప్రతి ఒక్కరూ దేశం కోసం పనిచేయాలి" అని పిలుపునిచ్చారు. 1969 నుంచే మహిళా సంక్షేమానికి బాబా ప్రాధాన్యత ఇచ్చారని గుర్తుచేశారు.

**బాబా బోధనలు ప్రపంచ శాంతికి మార్గం: సీఎం చంద్రబాబు**

సీఎం చంద్రబాబు మాట్లాడుతూ.. "'లవ్ ఆల్.. సర్వ్ ఆల్' అనేదే బాబా సిద్ధాంతమని, ఆయన ప్రవచించిన పంచ సూత్రాలు పాటిస్తే ప్రపంచం


వివరాలు 2లో..



సత్యసాయి సిద్ధాంతానికి టెక్నాలజీ జోడింపు...

# 2047 నాటికి భారత్ నంబర్ వన్

- సాయి సిద్ధాంతాలకు ఆధునిక సాంకేతికతను జోడించి ముందుకు సాగుతామన్న సీఎం
- భవిష్యత్ టెక్నాలజీలన్నింటినీ ఆంధ్రప్రదేశ్‌కు తీసుకొస్తామని వెల్లడి
- సాయి స్ఫూర్తితో సంపన్న, ఆరోగ్యవంతమైన సమాజం నిర్మిద్దామని పిలుపు



పెన్ పవర్ డెస్క్:2047 నాటికి భారత్‌ను ప్రపంచంలోనే అగ్రగామి దేశంగా నిలపడమే లక్ష్యమని, శ్రీ సత్యసాయి అందించిన మానవతా విలువలకు ఆధునిక సాంకేతికతను జోడించి ఈ లక్ష్యాన్ని సాధిస్తామని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు ఉద్ఘాటించారు. పుట్టపర్తిలోని శ్రీ సత్యసాయి ఇనిస్టిట్యూట్ ఆఫ్ హయ్యర్ లెర్నింగ్ 44వ స్నాతకోత్సవంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా పట్టభద్రులైన విద్యార్థులకు

వివరాలు 2లో..

# అలా చేస్తే నిధులివ్వను

మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి వ్యాఖ్యలు వివాదాస్పదం



- బారామతిలో స్థానిక సంస్థల ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న అజిత్ పవార్
- తమ పార్టీ అభ్యర్థులను తిరస్కరిస్తే నిధులు కేటాయింపులో అలాగే ఉంటానని వ్యాఖ్య
- అజిత్ పవార్ ఓటర్లు బెదిరిస్తున్నారన్న విపక్షాలు

పెన్ పవర్ డెస్క్:ఎన్సీపీ అభ్యర్థులను గెలిపిస్తేనే అభివృద్ధికి నిధుల కొరత లేకుండా చూస్తానని మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి అజిత్ పవార్ చేసిన వ్యాఖ్యలు చర్చనీయాం

వివరాలు 2లో..

# బెంగళూరులో ప్రైవేటు ఫంక్షన్‌లో పక్కపక్కనే జగన్, కేటీఆర్



- పక్కపక్కనే కూర్చుని ముచ్చటించుకున్న జగన్, కేటీఆర్
- ఇద్దరు కలిసి ఫంక్షన్ హాలులోకి వస్తున్న వీడియోలు వైరల్
- కేటీఆర్ చెబుతుంటే వింటూ కూర్చున్న జగన్

పెన్ పవర్ డెస్క్:ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, వైసీపీ అధినేత జగన్, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఒకే వేదికపై కలుసుకున్నారు. ఈరోజు సాయంత్రం బెంగళూరులోని ఓ ప్రైవేటు కార్యక్రమంలో వీరిద్దరు పాల్గొన్నారు. పక్కపక్కనే కూర్చుని కాసేపు ముచ్చటించారు. కేటీఆర్

వివరాలు 2లో..

వైద్యుల నిర్లక్ష్యంపై సీఎం సీరియస్..

# కఠిన చర్యలకు ఆదేశం



- కాకినాడ, రాజమండ్రి ఆసుపత్రుల్లో వైద్య నిర్లక్ష్యంపై సీఎం ఆగ్రహం
- కాకినాడలో ఇంజెక్షన్ వికటించి 8 నెలల గర్భిణి మృతి
- రాజమండ్రిలో రోగికి గడువు ముగిసిన మందుల పంపిణీ
- బాధ్యులైన వైద్యులు, సిబ్బందిపై చర్యలకు చంద్రబాబు ఆదేశం
- ఇలాంటి ఘటనలు పునరావృతం కావొద్దని అధికారులకు హెచ్చరిక

వివరాలు 2లో..

# రైతులకు అన్యాయం జరగనివ్వం.. సీఆర్డీఏ మీటింగ్ లో మంత్రి నారాయణ

- సీఆర్డీఏ కార్యాలయంలో ఈరోజు సమావేశమైన త్రిసభ్య కమిటీ
- రైతు జేఏసీ ప్రతినిధులు కూడా హాజరు
- రైతులు లేవనెత్తిన అంశాలపై చర్చ



పెన్ పవర్ డెస్క్:ప్రభుత్వంపై విశ్వాసంతో రాజధాని ని ర్మాణానికి భూములు ఇచ్చిన రైతులకు ఎట్టి పరిస్థితుల్లోనూ అన్యాయం జరగ నివ్వబోమని ఏపీ పురపాలక శాఖ మం త్రి నారాయణ స్పష్టం చేశారు. ఈమే రకు ఈ రోజు ఉదయం జరిగిన

వివరాలు 2లో..

# ఎలారిక్కిం సౌగ్యమా?

## తమిళంలో పలకరించిన నారా భువనేశ్వరి


- కుప్పం నియోజకవర్గంలో నారా భువనేశ్వరి పర్యటన
- ఆధార్ కార్డు లేకపోవడంతో ఆర్టీసీ బస్సులో టికెట్ కొనుగోలు
- చంద్రబాబు తరపున తాను ప్రజల వద్దకు వచ్చానన్న భువనేశ్వరి
- తమిళ ప్రసంగం, కోలాటంతో స్థానికులను ఆకట్టుకున్న వైనం

వివరాలు 2లో..



జీ20 వేదికగా ప్రధాని మోదీ 4 కీలక ప్రతిపాదనలు..

# ప్రపంచ అభివృద్ధికి కొత్త దారి!



- జీ20 సదస్సులో ప్రధాని మోదీ ప్రసంగం
- సాంప్రదాయ విజ్ఞానం కోసం 'గ్లోబల్ ట్రెడిషనల్ నాలెడ్జ్ రిపాజిటరీ' ఏర్పాటుకు సూచన
- ఆఫ్రికాలో 10 లక్షల మంది శిక్షకుల తయారీకి ప్రత్యేక కార్యక్రమం
- డ్రగ్స్-టెర్రర్ నెట్‌వర్క్‌పై ఉమ్మడి పోరుకు ప్రపంచ దేశాలకు పిలుపు
- ఆరోగ్య అత్యవసర సేవల కోసం గ్లోబల్ రెస్పాన్స్ టీమ్ ఏర్పాటుకు ప్రతిపాదన

పెన్ పవర్ డెస్క్:దక్షిణాఫ్రికాలోని జొహాన్నెస్‌బర్గ్‌లో శనివారం ప్రారంభమైన జీ20 దేశాధినేతల శిఖరాగ్ర సదస్సులో భారత ప్రధాని నరేంద్ర మోదీ ప్రపంచానికి సరికొత్త మార్గాన్ని నిర్దేశించారు. ప్రారంభ సెషన్‌లో ప్రసంగించిన ఆయన.. ప్రపంచ

వివరాలు 2లో..

# గుర్తు లేదు, మర్చిపోయా..

విచారణలో ఐబొమ్మ రవి పొంతన లేని సమాధానాలు


- ఐ-బొమ్మ రవి మూడో రోజు విచారణ... దేశ, విదేశాల్లోని సంబంధాలపై ఆరా
- రవిని ఐదు రోజుల పోలీసుల కస్టడీకి ఇచ్చిన నాంపల్లి కోర్టు
- మూడో రోజు ముగిసిన ఐ-బొమ్మ రవి విచారణ
- విదేశాల్లోని లింకులు, ఆస్తులపై ప్రశ్నించిన అధికారులు



పెన్ పవర్ డెస్క్:మూడో రోజు ఐ బొమ్మ రవి కస్టడీ విచారణ ము గిసింది. విచారణలో పోలీసులకు రవి ఏమాత్రం సహకరించడం లేదు. అధికారులు ఏది అడిగినా విచారణకు ఏమాత్రం సహకరించడం లేదు. పొంతన లేని సమాధానాలు చెబుతున్నాడని పోలీసులు చెబుతున్నారు. యూజర్ ఐడీ, పాస్ వర్డ్ లు అడిగితే గుర్తు లేదు, మరిచిపోయా అని సమాధానం ఇస్తున్నాడు రవి. ఎథికల్ హ్యాకర్ల సహాయంతో హార్డ్ డిస్క్ లు, పెన్ డ్రైవ్ లు ఓపెన్ చేయిస్తున్నారు పోలీసులు. ఫ్రాన్స్, నెదర్లాండ్స్ లో మెయిన్ సర్వర్లు

వివరాలు 2లో..

# మా కుటుంబానికి చెందిన ఈ సినిమా హాల్ అప్పట్లో పెద్ద పొలిటికల్ సెంటర్



పెన్ పవర్ డెస్క్:టీడీపీ సీనియర్ నేత, మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి తన పాత జ్ఞాపకాలను నెమరేసుకుంటూ భావోద్వేగానికి లోనయ్యారు. నెల్లూరులోని తమ కుటుంబానికి చెందిన శ్రీనివాసమహల్ సినిమా హాల్ స్థలాన్ని సందర్శించినప్పుడు

వివరాలు 2లో..

# సొంత పార్టీలోని 'కామ పిశాచుల'ను కంట్రోల్ చేయడంలో స్టాలిన్ విఫలమయ్యారు

- డీఎంకే పాలనలో మహిళలపై దాడులు పెరిగాయన్న పళనిస్వామి
- విల్లుపురం డీఎంకే నేత లైంగిక వేధింపుల ఘటనపై తీవ్ర ఆగ్రహం
- సొంత పార్టీ నేతలనే అదుపు చేయలేని స్టాలిన్ రాష్ట్రాన్ని ఏం కాపాడతారని ప్రశ్న
- నిందితులపై తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్

పెన్ పవర్ డెస్క్:తమిళనాడులో అధికార డీఎంకే ప్రభుత్వంపై అన్నాడీ ఎంకే ప్రధాన కార్యదర్శి, ప్రతిపక్ష నేత ఎడప్పాడి కె. పళనిస్వామి తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. సొంత పార్టీలోని 'కామ పిశాచుల'ను అదుపు చేయడంలో ముఖ్యమంత్రి

వివరాలు 2లో..



## ఎడిటర్ వ్యూ

# కేశినేని పై స్థాయిలో నేతలకు టచ్ లోకి వెళ్లినట్లుందిగా?

విజయవాడ మాజీ పార్లమెంటు సభ్యుడు కేశినేని నాని తిరిగి రాజకీయంగా యాక్టివ్ కావాలని భావిస్తున్నట్లుంది. తన సోదరుడు కేశినేని శివనాథ్ పై ఇటీవల కాలంలో సొంత పార్టీ నేతల నుంచి వస్తున్న విమర్శలతో ఆయన మరొకసారి రాజకీయంగా తానేంటో చూపాలనుకుంటున్నారు. సాధారణ ఎన్నికలకు ఇంకా మూడేళ్ల సమయం ఉంది. అయితే కేశినేని నాని గత ఎన్నికలకు ముందు వైసీపీలో చేరినప్పటికీ, ఆయన ఇప్పుడు మనసు మార్చుకుని బీజేపీ లో చేరాలని నిర్ణయించుకున్నారని తెలిసింది. పదేళ్ల పాటు పార్లమెంటు సభ్యుడిగా ఉన్న కేశినేనినాని ఢిల్లీలో తనకున్న పరిచయాలతో త్వరలోనే బీజేపీ తీర్థం పుచ్చుకునేందుకు సిద్ధమవుతున్నారని సమాచారం.

**వరసగా రెండు సార్లు గెలిచి...**

విజయవాడ పార్లమెంటుకు 2024, 2019 ఎన్నికల్లో గెలిచిన కేశినేని నాని ఏనాడూ పెద్దగా విమర్శలు ఎదుర్కొనలేదు. ఇప్పుడు తన సోదరుడితో పోల్చుకుంటే కేశినేనినాని బెటర్ అన్న పేరును బెజవాడ ప్రాంతంలో తెచ్చుకున్నారు.దీంతో కేశినేని నాని మరోసారి విజయవాడ నుంచి పోటీ చేయడానికి సిద్ధమవుతున్నారని పెద్దయెత్తున ప్రచారం జరుగుతుంది. ఇటీవల బీజేపీ కేంద్ర నాయకత్వంలోకి టచ్ లోకి వెళ్లిన కేశినేని నాని హస్తిన కు వెళ్లి పార్టీ కండువా కప్పుకోవాలని సిద్ధమవుతున్నారని తెలిసింది. అన్నీ అనుకూలిస్తే వచ్చేఏడాది ఆరంభంలోనే ఆయన కమలం తీర్థం పుచ్చుకునే అవకాశాలున్నాయని చెబుతన్నారు. ఈ మేరకు ఆయన సన్నిహితులకు కూడా ఈ సమాచారం చెప్పినట్లు తెలిసింది.

**త్వరలో నియోజకవర్గాల పర్యటనలు...**

విజయవాడ అంటే ప్రేమ అని పిచ్చి అని కేశినేని నాని గతంలో ఒక సందర్భంలో తెలిపారు. విజయవాడ అంటే ప్రేమతోనే తాను రాజకీయాలకు దూరంగా ఉన్నప్పటికీ సేవ చేయడానికి ముందుంటానని తెలిపారు. అయితే సేవ చేయాలంటే రాజకీయాలు అవసరమని గుర్తించిన కేశినేని నాని త్వరలోనే బీజేపీ జెండా పట్టుకుని తిరిగే అవకాశాలున్నాయంటున్నారు. కేశినేని నాని రాజకీయంగా రీ ఎంట్రీ ఇవ్వాలంటూ ఆయన సన్నిహితులు కూడా వత్తిడి తెస్తున్నారు. అంతకు ముందుగానే కేశినేని నాని విజయవాడ పార్లమెంటు నియోజకవర్గం పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో పర్యటించి తన అనుచరులును, అభిమానులను కలుసుకుని సమావేశాలను ఏర్పాటు చేసుకునే ప్రయత్నాలు చేస్తున్నట్లు వినికిడి. మొత్తం మీద కేశినేని తిరిగి యాక్టివ్ అవుతానని చెబుతుండటంతో కేశినేని అనుచరుల్లో పొలిటికల్ కిక్కు వచ్చిందట.

## అలా చేస్తే నిధులివ్వను

- మొదటి పేజి తరువాయి

శమ య్యాయి. స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో బారామతిలో నిర్వహించిన ప్రచారంలో ఆయన మాట్లాడు తూ, ఎన్నికల్లో తమ పార్టీ అభ్యర్థులను తిరస్కరిస్తే నిధుల కేటాయింపు విషయంలో తానూ అదే విధంగా వ్యవహరిస్తానని వ్యాఖ్యానించారు.స్థానికంగా ఎన్సీపీకి చెందిన 18 మంది అభ్యర్థులను గెలిపిస్తేనే ఆ ప్రాంత అభివృద్ధికి నిధులు మంజూరు చేస్తానని ఆయన అన్నారు. హామీలను నెరవేర్చే విషయంలో తాను కట్టుబడి ఉంటానని స్పష్టం చేశారు. "మీ వద్ద ఓట్లు ఉన్నాయి, నా వద్ద నిధులు ఉన్నాయి. మీరు తిరస్కరిస్తే నేను కూడా తిరస్కరిస్తాను" అని ఆయన హెచ్చరించారు. రాష్ట్ర ఆర్థిక మంత్రిగా తన వద్ద నిధులు ఉన్నాయని ఆయన పేర్కొన్నారు.అజిత్ పవార్ వ్యాఖ్యలపై ప్రతిపక్షాలు తీవ్రంగా స్పందించాయి. ఆయన ఓటర్లను బెదిరింపులకు గురిచేస్తున్నారని విమర్శించాయి. అజిత్ పవార్ తన సొంత నిధులతో అభివృద్ధి పనులు చేస్తున్నట్లు మాట్లాడుతున్నారని, ప్రజలు కట్టిన పన్నుల ద్వారానే నిధులు విడుదల అవుతాయని శివసేన (యూబీటీ) నేత అంబాదాస్ ఆగ్రహం వ్యక్తం చేశారు.

## సొంత పార్టీలోని 'కామ పిశాచుల'ను కంట్రోల్ చేయడంలో స్టాలిన్ విఫలమయ్యారు

- మొదటి పేజి తరువాయి

ఎంకే స్టాలిన్ పూర్తిగా విఫలమయ్యారని ఆయన శనివారం ఒక ప్రకటనలో తీవ్ర ఆరోపణలు చేశారు. విల్లుపురానికి చెందిన డీఎంకే యూనియన్ కార్యదర్శి ఒకరు గత ఆరు నెలలుగా ఓ మహిళను లైంగికంగా వేధిస్తున్నారనే వార్తలు తనను దిగ్భ్రాంతికి గురిచేశాయని ఆయన పేర్కొన్నారు.బాధితురాలి ఫిర్యాదు ప్రకారం, నిందితుడు తన పార్టీ పలుకుబడిని అడ్డం పెట్టుకుని, "నన్ను పోలీసులేమీ చేయలేరు, ఇక్కడ నేనే పెద్ద మనిషిని" అని బెదిరిస్తూ వేధింపులకు పాల్పడినట్లు పళనిస్వామి తెలిపారు. ఈ ఒక్క ఘటనే డీఎంకే పాలనలో నెలకొన్న భయానక వాతావరణానికి నిదర్శనమని ఆయన విమర్శించారు. అధికార పార్టీలో పలుకుబడి ఉన్న వ్యక్తుల చేతిలో మహిళలు నిరంతరం వేధింపులకు, దాడులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా సీఎం స్టాలిన్‌ను పళనిస్వామి సూటిగా ప్రశ్నించారు. "డీఎంకే పాలనలో మహిళలు పడుతున్న బాధలపై ముఖ్యమంత్రి సమాధానం ఏమిటి? మహిళలకు రక్షణ కల్పించాల్సింది పోయి, ఇప్పుడు డీఎంకే నేతల నుంచే వారికి రక్షణ కల్పించాల్సిన దుస్థితి ఏర్పడిందా?" అని నిలదీశారు. తీవ్రమైన నేరాలకు పాల్పడుతున్న పార్టీ నేతలపై చర్యలు తీసుకోవడంలో ముఖ్యమంత్రి పదేపదే విఫలమవుతున్నారని ఆయన ఆరోపించారు. "గతంలో ఓ మంత్రి సన్నిహితుడు అసభ్యకరమైన చర్యలకు పాల్పడిన ఘటన నుంచి, తాజాగా ఓ యూనియన్ కార్యదర్శిపై వచ్చిన క్రూరమైన ఆరోపణల వరకు.. సొంత పార్టీలోని లైంగిక నేరగాళ్లను నియంత్రించలేని నాయకుడిగా స్టాలిన్ నిరూపించుకున్నారు" అని పళనిస్వామి వ్యాఖ్యానించారు.రాష్ట్రంలో శాంతిభద్రతల పరిరక్షణపై ప్రభుత్వం చేస్తున్న వాదనల విశ్వసనీయతను ఆయన ప్రశ్నించారు. "సొంత పార్టీ కార్యకర్తలనే క్రమశిక్షణలో పెట్టలేని ముఖ్యమంత్రి, మొత్తం తమిళనాడు ప్రజలను ఎలా కాపాడగలరు?" అని ఆయన ప్రశ్నించారు. విల్లుపురం ఘటన అత్యంత హేయమైనదని, తీవ్ర ఆందోళన కలిగించే విషయమని పేర్కొన్నారు. రాజకీయ జోక్యం లేకుండా నిందితుడిపై తక్షణమే కఠినమైన చట్టపరమైన చర్యలు ప్రారంభించాలని స్టాలిన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

అధికారంలో ఉన్నవారు తమ మద్దతుదారులు చేసే నేరాల పట్ల ఉదాసీనంగా ఉన్నంత కాలం తమిళనాడులో మహిళల భద్రత సాధ్యం కాదని ఆయన స్పష్టం చేశారు. రాష్ట్రంలోని మహిళల భద్రత, గౌరవం కోసం తమ పార్టీ ప్రభుత్వంపై ఒత్తిడి కొనసాగిస్తుందని పళనిస్వామి పునరుద్ఘాటించారు.

## జీ20 వేదికగా ప్రధాని మోదీ 4 కీలక ప్రతిపాదనలు..

# ప్రపంచ అభివృద్ధికి కొత్త దారి!

- మొదటి పేజి తరువాయి

అభివృద్ధి ప్రమాణాలను పునఃపరిశీలిం చాల్సిన అవసరం ఉందని నొక్కిచెప్పారు. సమ్మిళిత, సుస్థిర వృద్ధి లక్ష్యంగా పలు కీలకమైన, వినూత్నమైన నాలుగు కార్యక్రమాలను ప్రతిపాదించారు. ఆఫ్రికా ఖండం తొలిసారిగా జీ20 సదస్సుకు ఆతిథ్యం ఇస్తున్న తరుణంలో, అభివృద్ధికి కొత్త నిర్వచనం ఇవ్వడానికి ఇదే సరైన సమయమని ఆయన అభిప్రాయపడ్డారు. 'సమ్మిళిత, సుస్థిర ఆర్థిక వృద్ధి' అనే అంశంపై జరిగిన ఈ సెషన్‌లో మోదీ మాట్లాడుతూ, భారతదేశపు ప్రాచీన నాగరికతా విలువలు, ముఖ్యంగా ఏకాత్మ మానవతావాదం (%×త్వవ్రత్మీఖ్రీ ఎబఋఅఱంఎ%) ప్రపంచానికి ఒక మార్గాన్ని చూపగలవని అన్నారు. అనంతరం తన ప్రసంగంలోని ముఖ్యాంశాలను 'ఎక్స్' వేదికగా పంచుకున్నారు.

**నాలుగు ప్రతిపాదనలు ఇవే...!**

ప్రపంచ అభివృద్ధికి సంబంధించి నాలుగు వినూత్నమైన ప్రతిపాదనలను ఆయన ప్రపంచ దేశాల ముందు ఉంచారు. ప్రపంచ అభివృద్ధి పారామీటర్లను పునఃసమీక్షించి, సమ్మిళిత, సుస్థిర వృద్ధిపై దృష్టి పెట్టాల్సిన సమయం ఇదేనని మోదీ పిలుపునిచ్చారు. మొదటి ప్రతిపాదనగా, జీ20 ఆధ్వర్యంలో 'గ్లోబల్ ట్రెడిషనల్ నాలెడ్జ్ రిపాజిటరీ'ని ఏర్పాటు చేయాలని మోదీ సూచించారు. పర్యావరణ అనుకూల, సాంస్కృతిక జీవన విధానాలను పరిరక్షించే సాంప్రదాయ విజ్ఞానాన్ని భవిష్యత్ తరాలకు అందించేందుకు ఇది ఉపయోగపడుతుందని వివరించారు. దీనికి భారతీయ విజ్ఞాన వ్యవస్థ ప్రాతిపదికగా నిలుస్తుందని తెలిపారు. రెండో కీలక ప్రతిపాదనగా, ఆఫ్రికా అభివృద్ధికి 'జీ20–ఆఫ్రికా స్కిల్స్ మల్టిప్లయర్ ఇనిషియేటివ్'ను ప్రధాని ప్రకటించారు. ఈ కార్యక్రమం ద్వారా రాబోయే దశాబ్దంలో ఆఫ్రికాలో 10 లక్షల మంది సర్టిఫైడ్ శిక్షకులను తయారు చేయడమే లక్ష్యమని పేర్కొన్నారు. ప్రపంచ పురోగతికి ఆఫ్రికా అభివృద్ధి చాలా కీలకమని ఆయన స్పష్టం చేశారు.

అలాగే, డ్రగ్స్–టెర్రర్ సంబంధాలను ఎదుర్కోవడంపై మరో ముఖ్యమైన ప్రతిపాదన చేశారు. ఫెంటానిల్ వంటి ప్రమాదకరమైన సింథటిక్ డ్రగ్స్ వ్యాప్తిపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. డ్రగ్స్ అక్రమ రవాణాను అడ్డుకోవడానికి, ఉగ్రవాదానికి నిధులు అందకుండా చేయడానికి జీ20 దేశాలన్నీ కలిసి పనిచేయాలని పిలుపునిచ్చారు. చివరగా, 'జీ20 గ్లోబల్ హెల్త్‌కేర్ రెస్పాన్స్ టీమ్'ను ఏర్పాటు చేయాలని మోదీ సూచించారు. ఆరోగ్య అత్యవసర పరిస్థితులు, ప్రకృతి వైపరీత్యాల సమయంలో వేగంగా స్పందించేందుకు జీ20 దేశాల వైద్య నిపుణులతో ఈ బృందాలను సిద్ధంగా ఉంచాలని ఆయన అభిప్రాయపడ్డారు.

# ఎలారిక్కిం సౌగ్యమా?:

## తమిళంలో పలకరించిన నారా భువనేశ్వరి

ఏపీ సీఎం చంద్రబాబు భార్య, ఎన్టీఆర్ మెమోరియల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ నారా భువనేశ్వరి కుప్పం నియోజకవర్గంలో పర్యటించారు. శాంతిపురం, రామకుప్పం మండలాల్లో జరిగిన పలు కార్యక్రమాల్లో ఆమె పాల్గొన్నారు. ఈ పర్యటనలో కొన్ని ఆసక్తికర సంఘటనలు చోటుచేసుకున్నాయి. ముఖ్యంగా, ఆర్టీసీ బస్సులో ప్రయాణిస్తున్న ఆమె, ఆధార్ కార్డు అందుబాటులో లేకపోవడంతో డబ్బులు చెల్లించి టికెట్ తీసుకోవడం అందరి దృష్టిని ఆకర్షించింది. వివరాల్లోకి వెళితే, శాంతిపురం మండలం కడపల్లె నుంచి తుమ్మిశి చెరువు వరకు భువనేశ్వరి మహిళలతో కలిసి ఆర్టీసీ బస్సులో ప్రయాణించారు. ఈ సందర్భంగా 'స్త్రీ శక్తి' పథకం అమలు గురించి వారిని అడిగి తెలుసుకున్నారు. ఉచిత ప్రయాణానికి ఆధార్ కార్డు తప్పనిసరి కావడంతో, మహిళా కండక్టర్ ఆమెను ఆధార్ కార్డు చూపించమని కోరారు. తన వద్ద కార్డు లేదని, ఫోన్‌లో ఉన్నప్పటికీ దానిని ఇంటి వద్దే మర్చిపోయానని భువనేశ్వరి తెలిపారు. దీంతో కండక్టర్ నిబంధనల ప్రకారం టికెట్ తీసుకోవాలని సూచించగా, ఆమె వెంటనే అంగీకరించి డబ్బులు చెల్లించి టికెట్ కొనుగోలు చేశారు.అనంతరం నడింపల్లెలో జరిగిన సభలో భువనేశ్వరి మాట్లాడుతూ, తాను కుప్పం ఎందుకు వస్తున్నానో వివరించారు. రాష్ట్ర అభివృద్ధి

పనులతో చంద్రబాబు తీరిక లేకుండా ఉన్నారని, అందుకే ఆయన బదులుగా ప్రతి మూడు నెలలకు ఒకసారి తాను వచ్చి ప్రజల సమస్యలు తెలుసుకుంటానని చెప్పారు. తన ప్రసంగాన్ని తమిళంలో "ఎల్లారక్కుం సౌగ్యమా?" (అందరూ బాగున్నారా?) అంటూ ప్రారంభించి స్థానికులను ఆకట్టుకున్నారు. అంతకుముందు మహిళలతో కలిసి కోలాటం ఆడి వారిలో ఉత్సాహం నింపారు.ఈ పర్యటనలో భాగంగా తుమ్మిశి, విజలాపురం చెరువుల వద్ద జలహారతి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. కెనమాకులపల్లెలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రారంభించి, పర్యావరణ పరిరక్షణ బాధ్యతను ప్రతి ఒక్కరూ తీసుకోవాలని పిలుపునిచ్చారు.

## వైద్యుల నిర్లక్ష్యంపై సీఎం సీరియస్.. కఠిన చర్యలకు ఆదేశం

ప్రభుత్వాసుపత్రుల్లో వైద్య సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా చోటుచేసుకున్న రెండు వేర్వేరు సంఘటనలపై ముఖ్యమంత్రి చంద్రబాబు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కాకినాడ, రాజమండ్రి ఆసుపత్రుల్లో జరిగిన ఈ ఘటనలపై ఆయన స్పందిస్తూ.. బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారులను ఆదేశించారు.వివరాల్లోకి వెళితే, కాకినాడ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి (జీజీహెచ్)లో తాళ్లరేవు మండలం గడిమొగ గ్రామానికి చెందిన 8 నెలల గర్భిణి మల్లేశ్వరి చికిత్స పొందుతూ మరణించారు. ఆమెకు పాంటాప్రోజోల్ ఇంజెక్షన్ పడదని, హైపర్‌టెన్షన్, డయాబెటిస్ ఉన్నాయని కేస్ షీట్‌లో స్పష్టంగా ఉన్నప్పటికీ, పీజీ వైద్య విద్యార్థిని నవంబర్ 20న అదే ఇంజెక్షన్ ఇచ్చారు. దీంతో అస్వస్థతకు గురైన ఆమెకు ఫిట్స్ వచ్చి, గుండెపోటుతో అదే రోజు రాత్రి ప్రాణాలు కోల్పోయినట్లు ప్రాథమిక విచారణలో వెల్లడైంది. అసిస్టెంట్ ప్రొఫెసర్ పర్యవేక్షణ లోపం కూడా ఈ ఘటనకు కారణంగా తేలింది. అలాగే, రాజమండ్రి ప్రభుత్వాసుపత్రిలోనూ ఇలాంటి నిర్లక్ష్యమే వెలుగుచూసింది. అక్టోబర్ 2025తో గడువు ముగిసిన మందులను నవంబర్ 8న 55 ఏళ్ల రోగికి అక్కడి సిబ్బంది అందజేశారు. వాటిని వాడిన తర్వాత ఆ రోగి ఆరోగ్యం మరింత క్షీణించింది.ఈ రెండు ఘటనలపై తీవ్రంగా స్పందించిన ముఖ్యమంత్రి, సంబంధిత వైద్య సిబ్బందిపై పూర్తిస్థాయి విచారణ జరిపి కఠిన చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. కాకినాడలో మృతి చెందిన గర్భిణీ కుటుంబానికి తక్షణమే సాయం అందించాలని సూచించారు. భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడాల్సిన బాధ్యత అధికారులదేనని ఆయన స్పష్టం చేశారు.

## సత్యసాయి సిద్ధాంతానికి టెక్నాలజీ జోడింపు...

# 2047 నాటికి భారత్ నంబర్ వన్

- మొదటి పేజి తరువాయి

హృదయపూర్వక అభినందనలు తెలిపారు.విలువల ఆధారిత విద్య, వ్యక్తిత్వ నిర్మాణమే కేంద్రంగా పనిచేస్తున్న సత్యసాయి విద్యాసంస్థ స్నాతకోత్సవంలో పాల్గొనడం గౌరవంగా భావిస్తున్నానని చంద్రబాబు అన్నారు. "భగవాన్ బాబా అందించిన విశిష్ట విద్యా విధానానికి ఇక్కడి విద్యార్థులే ప్రతిరూపాలు. క్రమశిక్షణ, ప్రేమ, సేవ అనేవే విద్యార్థులకు ప్రథమ, ద్వితీయ, తృతీయ భాషలని బాబా చెప్పారు. ఆయన మన కోసం 'సాయి సిద్ధాంతాన్ని' ఇచ్చి వెళ్లారు. ఈ సిద్ధాంతాన్ని ఒక ఉద్యమంలా ముందుకు తీసుకెళ్లాలి" అని పిలుపునిచ్చారు. సత్యం, కరుణ, నిజాయతీ వంటి విలువలను ఆచరిస్తూ సమాజ సేవ చేయాలని పట్టభద్రులకు సూచించారు.భారతదేశం సాధిస్తున్న ప్రగతిని వివరిస్తూ, 1991 ఆర్థిక సంస్కరణలు, 1990లలో వచ్చిన సాంకేతిక పురోగతి దేశాన్ని మార్చేశాయని అన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశం 10వ స్థానం నుంచి 4వ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఎదిగిందని గుర్తుచేశారు. "2047 నాటికి ప్రపంచంలోనే నంబర్ వన్ దేశంగా అవతరిస్తాం. దీనికోసం కృత్రిమ మేధ (%ూ×%), డేటా సెంటర్లు, క్వాంటం, ఏరోస్పేస్, సెమీకండక్టర్ వంటి భవిష్యత్ రంగాలపై దృష్టి సారిస్తున్నాం" అని తెలిపారు.

రాష్ట్ర అభివృద్ధి ప్రణాళికలను వివరిస్తూ, "దేశంలో ఉన్న అన్ని ఫ్యూచర్ టెక్నాలజీలను ఏపీకి తీసుకొస్తున్నాం. సీఐఐ సదస్సు ద్వారా రూ. 13.25 లక్షల కోట్ల పెట్టుబడులు ఆకర్షించాం, దీనివల్ల 16 లక్షల ఉద్యోగాలు రానున్నాయి. గూగుల్ సంస్థ 15 బిలియన్ డాలర్ల పెట్టుబడితో రాష్ట్రంలో డేటా సెంటర్ ఏర్పాటు చేయనుంది" అని ప్రకటించారు. "ఒక కుటుంబం–ఒక పారిశ్రామికవేత్త, ఒక కుటుంబం–ఒక ఏఐ టెక్నీషియన్" అనే సిద్ధాంతంతో పనిచేస్తున్నామని, దేశంలో తెలుగు వారిని నంబర్ వన్ గా నిలపాలన్నదే తన ఆకాంక్ష అని స్పష్టం చేశారు.

యువతే దేశానికి సంరక్షకులని, ధైర్యంగా, ఆత్మవిశ్వాసంతో విలువలను పాటిస్తూ ముందుకు సాగాలని చంద్రబాబు ఉద్బోధించారు. బాబా స్ఫూర్తితో ఆరోగ్యవంతమైన, సంపన్నమైన, సంతోషకరమైన సమాజాన్ని (హెల్తీ, వెల్తీ, హ్యాపీ సొసైటీ) నిర్మించేందుకు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ వంటి ప్రముఖులు పాల్గొనడం సత్యసాయి బాబా గొప్పతనానికి నిదర్శనమని కొనియాడారు.

# సత్యసాయి సేవలు చిరస్మరణీయం

- మొదటి పేజి తరువాయి

శాంతితో వర్ధిల్లుతుందని అన్నారు. "సత్యసాయి బాబాతో నాకు మంచి అనుబంధం ఉంది. తాగునీటి ప్రాజెక్టుల కోసం అవసరమైతే ప్రశాంతి నిలయాన్ని తాకట్టు పెట్టడానికైనా ఆయన సిద్ధపడ్డారు. ఆయన స్ఫూర్తితో భక్తులు పెద్ద ఎత్తున విరాళాలిచ్చి ఆ ప్రాజెక్టులను పూర్తి చేశారు" అని గుర్తుచేసుకున్నారు. సత్యసాయి ట్రస్ట్ 140 దేశాల్లో 2 వేలకు పైగా శాఖలతో, 7.50 లక్షల మంది వాలంటీర్లతో సేవలందించడం అద్భుతమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో భాగంగా 'సత్యసాయి ట్రైబల్ ఉమెన్ హెల్త్ కేర్ ప్రోగ్రాం'ను ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రి నారా లోకేశ్, ఇతర మంత్రులు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## రైతులకు అన్యాయం జరగనివ్వం.. సీఆర్డీఏ మీటింగ్ లో మంత్రి నారాయణ

- మొదటి పేజి తరువాయి

సీఆర్డీఏ సమావేశం లో మంత్రి ఈ వ్యాఖ్యలు చేశారు. రాజధాని రైతుల సమస్యల పరిష్కారంపై సీఆర్డీఏ కార్యాలయంలో కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, పురపాలక శాఖ మంత్రి నారాయణ, ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్ కుమార్ ల త్రిసభ్య కమిటీ సమావేశమైంది.ఈ సమావేశంలో సీఆర్డీఏ కమిషనర్ కన్నబాబు, ముఖ్య అధికారులతో పాటు రైతు జేఏసీ ప్రతినిధులు కూడా హాజరయ్యారు. ఈ సందర్భంగా రైతులు లేవనెత్తిన పలు అంశాలపై చర్చ జరిగింది. వాటి పరిష్కారం కోసం కమిటీ సమాలోచనలు చేసింది. ఈ సందర్భంగా మంత్రి నారాయణ మాట్లాడుతూ.. ప్రభుత్వంపై నమ్మకంతో భూములు ఇచ్చిన రైతులకు అన్యాయం జరగదని చెప్పారు. ఏ రైతుకూ ఇబ్బంది లేకుండా చేయడమే ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు.కేంద్ర మంత్రి పెమ్మసాని మాట్లాడుతూ.. వైసీపీ ప్రభుత్వ హయాంలో అప్పటి సీఎం జగన్ కారణంగా అమరావతిలో అభివృద్ధి పనులు ఎక్కడివక్కడే నిలిచిపోయాయని చెప్పారు. రాజధానిలో పెండింగ్ లో ఉన్న జరీబు భూముల సమస్యకు 30 రోజుల్లో పరిష్కారం చూపిస్తామని హామీ ఇచ్చారు. గ్రామ కంఠాలు, లంక భూముల సమస్యలనూ పరిష్కరించేందుకు కృషి చేస్తామని తెలిపారు. అసైన్డ్ భూములను అమ్ముకోకుండా జగన్ ప్రభుత్వం అడ్డుకుందన్నారు. రాజధాని ప్రాంతంలోని అసైన్డ్ భూములకు మిగతా అసైన్డ్ భూములకు వ్యత్యాసం ఉందని మంత్రి గుర్తు చేశారు. ఈ సమస్యను మూడు నెలల్లో పరిష్కరిస్తామని చెప్పారు. భూములు ఇచ్చిన రైతుల్లో 90 శాతం మందికి ప్లాట్ల కేటాయింపు పూర్తయిందని, మరో 20 రోజుల్లో డీపీఆర్ సిద్ధం చేస్తామని పేర్కొన్నారు. వచ్చే జూన్ నాటికి రాజధాని గ్రామాల్లో తాగునీరు, డ్రెయిన్ల నిర్మాణం పూర్తి చేస్తామని మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ చెప్పారు.

### మా కుటుంబానికి చెందిన ఈ సినిమా

## హాల్ అప్పట్లో పెద్ద పొలిటికల్ సెంటర్

- మొదటి పేజి తరువాయి

ఈ సంఘటన చోటుచేసుకుంది. ఒకప్పుడు రాజకీయాలకు కేంద్రంగా ఉన్న ఆ ప్రదేశంలో అడుగుపెట్టగానే పాత రోజులు గుర్తుకొచ్చాయని ఆయన ఎక్స్ వేదికగా వివరించారు. "నెల్లూరులోని శ్రీనివాసమహల్ అంటేనే మాకు ఒక ఎమోషన్. మా కుటుంబానికి చెందిన ఈ సినిమా హాల్ అప్పట్లో పెద్ద పొలిటికల్ సెంటర్. ఎందరో రాజకీయ ప్రముఖులకు కేరాఫ్ అడ్రస్. కాలక్రమంలో మా కుటుంబం ఆ సినిమాహాలును విక్రయించగా ప్రస్తుతం జైనులు కొనుగోలు చేసి అపార్టుమెంటు నిర్మించారు. ఆ అపార్టుమెంటు ప్రాంగణంలో నిర్మించిన జైన్ మందిరం ప్రారంభోత్సవానికి పెద్దల ఆహ్వానం మేరకు నేను, మా సోదరుడు శ్రీనివాసులు రెడ్డి వెళ్లాం. అక్కడ అడుగుపెట్టగానే పాతరోజులు గుర్తుకొచ్చాయి. శ్రీనివాసమహల్ కేంద్రంగా చేసిన రాజకీయ కార్యకలాపాల జ్ఞాపకాలను నెమరేసుకున్నాం" అని ట్వీట్ చేశారు. ఈ మేరకు సోమిరెడ్డి కొన్ని ఫొటోలను కూడా పంచుకున్నారు.

## గుర్తు లేదు, మర్చిపోయా..

- మొదటి పేజి తరువాయి


ఉన్నట్లు గుర్తించారు పోలీసులు. బ్యాంక్ ఖాతాల వివరాలపైనా కూడా రవి నోర విప్పడం లేదు. రవి అకౌంట్ల చిట్టా ఇవ్వాలని పలు బ్యాంకులకు మెయిల్ చేశారు పోలీసులు. రవి ప్రతీ 20 రోజులకు ఒక దేశానికి వెళ్తున్న రవి..విదేశీ పర్యటనలు అంటే ఇష్టంతోనే వెళ్లానని చెబుతున్నాడు. యూఎస్టీటీ ద్వారా వచ్చిన డబ్బులను ఎప్పటికప్పుడు ఖర్చు చేసేవాడని తేలింది. రవి విజిట్ చేసిన దేశాల్లో ఉన్న పైరసీ లింకుల గురించి కూపీ లాగుతున్నారు పోలీసులు..పోలీసుల విచారణలో 21 వేలకు పైగా సినిమాలు రవి పైరసీ చేసినట్లు తేలింది. మూడు దేశాల్లో సర్వర్లు ఏర్పాటు చేసి సినిమాలను పైరసీ చేసినట్లు ఒప్పుకున్నారని పోలీసులు తెలిపారు. రవి కేసును ఇప్పటికే సీసీఎస్ పోలీసులు విచారణ జరుపుతున్న సంగతి తెలిసిందే.. ఈ కేసులో ఇవాళ సీఐడీ ఎంట్రీ ఇచ్చింది. బెట్టింగ్ యాప్స్ ప్రమోషన్ కేసుల విచారణ జరుపుతున్న సీఐడీ రవి విషయంలోనూ ఆ కోణంలో దర్యాప్తు చేస్తోంది.మరో వైపు ఇదే కేసులో నవంబర్ 21న ఈడీ విచారించింది. రవి బ్యాంక్ ఖాతాల్లో రూ. 20 కోట్లు, క్రిప్టో ద్వారా నెలకు రూ.15లక్షలు జమ అయినట్లు గుర్తించారు.

## బెంగళూరులో ప్రైవేటు ఫంక్షన్‌లో పక్కపక్కనే జగన్, కేటీఆర్

- మొదటి పేజి తరువాయి

ఏదో చెబుతుండగా జగన్ వేడుకను తిలకిస్తూ విన్నారు. ఇందుకు సంబంధించిన ఫోటోలు, వీడియోలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్నాయి. వారిద్దరు కలిసి బయటి నుంచి ఫంక్షన్ హాలులోకి వస్తున్న వీడియోలు కూడా సోషల్ మీడియాలో హల్ చల్ చేస్తున్నాయి.తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత మొదటి తొమ్మిదిన్నరేళ్లు బీఆర్ఎస్ అధికారంలో కొనసాగింది. అదే సమయంలో ఆంధ్రప్రదేశ్‌లో మొదటి టర్మ్ తెలుగుదేశం, రెండో టర్మ్ వైసీపీ ప్రభుత్వాలు పాలించాయి. ఈ క్రమంలో 2019 నుంచి ఏపీలోని వైసీపీ ప్రభుత్వం, తెలంగాణలోని బీఆర్ఎస్ ప్రభుత్వం మధ్య సత్సంబంధాలు కొనసాగాయానే ప్రచారం జరిగింది. ఆ తర్వాత జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో తెలంగాణలో బీఆర్ఎస్, ఏపీలో వైసీపీ ఓటమి పాలయ్యాయి.ఇటీవల కేసీఆర్ పై, బీఆర్ఎస్ పదేళ్ల పాలనపై జగన్ సానుకూల వ్యాఖ్యలు చేశారు. కేసీఆర్ హయాంలో తెలంగాణ రాష్ట్రం ఎంతో అభివృద్ధి చెందిందని అన్నారు. ఈ రాజకీయ పరిణామాల నేపథ్యంలో వీరిద్దరు ఒక వేడుకలో కలవడం ప్రాధాన్యతను సంతరించుకుంది.

# స్వర్ణరథంపై శ్రీ మహాలక్ష్మి కటాక్షం





**తిరుపతి పెన్ పవర్ నవంబర్ 22 :** తిరుచానూరు శ్రీ పద్మావతీ అమ్మవారి కార్తీక బ్రహ్మోత్సవాల్లో ఆరో రోజైన శనివారం సాయంత్రం అమ్మవారు స్వర్ణరథంపై భక్తులకు దర్శనమిచ్చారు. సాయంత్రం 4.20 గంటల నుండి ఆలయ మాడ వీధుల్లో ఈ ఉత్సవం జరిగింది. కాంతులీనుతున్న స్వర్ణ రథంపై శ్రీ పద్మావతి అమ్మవారు విశేష స్వర్ణ, వజ్రాభరణాలను ధరించి భక్తులకు కనువిందు చేశారు. పెద్దసంఖ్యలో మహిళలు పాల్గొని స్వర్ణరథాన్ని లాగారు. ఈ కార్యక్రమంలో జేఈవో శ్రీ వి.వీరబ్రహ్మం, ఆలయ డెప్యూటీ ఈవో శ్రీ హరేంద్రనాథ్, ఎస్ ఇ- 3 జగదీశ్వర్ రెడ్డి, అర్చకులు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# పెన్ పవర్

## వై.ఎస్.ఆర్. కడప
## అన్నమయ్య జిల్లా

# “సత్యసాయి బోధనలు కాలాతీతం-విశ్వ శాంతికి మార్గదర్శకాలు”

## – భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము




**పుట్టపర్తి పెన్ పవర్ నవంబర్ 22 :** భగవాన్ శ్రీ సత్యసాయి బాబా శతజయంతి ఉత్సవాల సందర్భంగా శనివారం శ్రీ సత్యసాయి ప్రశాంతినిలయం పూర్ణచంద్ర ఆడిటోరియంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పాల్గొని భావోద్వేగపూర్వక ప్రసంగం చేశారు. ఈ కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి ఎన్.చంద్రబాబు నాయుడు, రాష్ట్ర మంత్రి నారా లోకేశ్, శ్రీ సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్.జే. రత్నాకర్, సేవా సంస్థల అఖిల భారత అధ్యక్షులు శ్రీ నినేష్ పాండే సహా అనేక ప్రముఖులు హాజరయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్రపతి ముర్ము మాట్లాడుతూ “మానవ సేవే మాధవ సేవ -సత్యసాయి బోధన ప్రతిదినం స్ఫూర్తి” శ్రీ సత్యసాయి బాబా వారి పవిత్ర స్మృతికి నమస్కారం తెలియ జేసిన ఆమె, బాబా మార్గనిర్దేశం దేశవ్యాప్తంగా మరియు ప్రపంచవ్యాప్తంగా కోట్లాది మందిని సేవా మార్గంలో నడిపించిందని కొనియాడారు. “లవ్ ఆల్-సర్వ్ ఆల్ సందేశం విశ్వవ్యాప్తం, శాశ్వతం” సత్యం, ధర్మం, శాంతి, ప్రేమ, అహింస అనే అయిదు మానవ విలువలను బాబా పాఠ్యాంశాలుగా నిలిపారని రాష్ట్రపతి పేర్కొన్నారు.

“కారెక్టర్ ఈజ్ ది బెస్ట్ క్వాలిటీ-విద్యతో పాటు స్వభావ నిర్మాణం అత్యంత ముఖ్యం” సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ అందిస్తున్న నాణ్యమైన, నిష్కామ విద్యను ఆమె ప్రశంసించారు. 1969లోనే బాలికల విద్య కోసం ప్రత్యేక మహిళా క్యాంపస్ ప్రారంభించడం బాబా నారీశక్తిపై ఉన్న దూరదృష్టిని స్పష్టం చేస్తుందని తెలిపారు. ఉచిత వైద్య సేవలు-తాగునీటి ప్రాజెక్టులు ప్రశంసనీయం సత్యసాయి ఆసుపత్రులు ఉచిత వైద్యాన్ని అందించడం, వేలాది గ్రామా లకు తాగునీరు చేరుస్తూ సేవలు చేయడం అత్యంత గొప్పదని పేర్కొన్నారు. “2047 నాటికి భారత్ అభివృద్ధి చెందిన దేశం ం ప్రతి సంస్థ, ప్రతి పౌరుడి పాత్ర కీలకం” దేశ అభివృద్ధిలో ధార్మిక సంస్థలు, సేవా సంస్థలు, ఎన్జీఓలు, ప్రైవేట్ సంస్థలు భాగస్వామ్యంగా ముందుకు రావాలని ఆమె పిలుపునిచ్చారు. “ప్రేమ, సేవను జీవితాల్లో ఆచరించే సంకల్పం చేద్దాం” సత్యసాయి శతజయంతి మన అందరికీ స్ఫూర్తిదాయకం కావాలని, ప్రపంచ శాంతి కోసం కలిసి పనిచేయాలని రాష్ట్రపతి పిలుపు నిచ్చారు. చివరిగా ఆమె కార్యక్రమ నిర్వాహకులకు ధన్యవాదాలు తెలుపుతూ “జై హింద్, జై భారత్” అని సభను ముగించారు.








# శ్రీ సత్య సాయి బాబా ఘన నివాళులు





**కడప పెన్ పవర్ నవంబర్ 22 :** భగవాన్ శ్రీ సత్యసాయి బాబా శత జయంతోత్సవాలలో భాగంగా శనివారం పుట్టపర్తిలోని ప్రశాంతి నిలయంలో ఉన్న భగవాన్ శ్రీ సత్యసాయి బాబా మహా సమాధికి ఘన నివాళులు అర్పించిన భారత ఉప రాష్ట్రపతి సిపి.రాధాకృష్ణన్, రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, రాష్ట్ర విద్యా, ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్, తదితరులు. ప్రశాంతి నిలయంలోని సాయి కుల్వంత్ హాల్లోని ఆలయంలో భక్తిశ్రద్ధలతో ప్రార్థన చేసిన భారత ఉప రాష్ట్రపతి. భారత ఉప రాష్ట్రపతికి ఆశీర్వచనాలు అందజేసిన వేద పండితులు.

# గండికోట పర్యాటక అభివృద్ధికి మాస్టర్ ప్లాన్

**– జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి – సాస్కి పథకం ద్వారా అమలు కానున్న ప్రాజెక్టుపై సమీక్ష**







**కడప,పెన్ పవర్ నవంబర్ 22 :** సాస్కి పథకం ద్వారా గండికోట పర్యాటక కేంద్రానికి ప్రపంచ స్థాయిలో కీర్తిని ప్రతిబింబించేలా మాస్టర్ ప్లాన్ రూపొందించి అభివృద్ధి చేస్తున్నామని జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి పేర్కొన్నారు. శనివారం కలెక్టరేట్ లోని బోర్డు మీటింగ్ గాలులో గండికోట పర్యాటక అభివృద్ధి పనులపై జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి.. డిఆర్వో విశ్వేశ్వర నాయుడు, జిల్లా పర్యాటక శాఖ, ఏపిటిడిసి అధికారులు, కాంట్రాక్టు ప్రతినిధులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం గండికోట ప్రాంతాన్ని పర్యాటక హబ్ గా అభివృద్ధి చేసేందుకు ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. పర్యాటక మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో రాష్ట్రాల్లో క్యాపిటల్ ఇన్వెస్ట్‌మెంట్ కోసం ప్రత్యేక సహకారం అందించే పథకం ద్వారా.. గండికోట పర్యాటక కేంద్రంలో సుసంపన్నమైన కోట మరియు గార్జ్ అనుభవాన్ని పర్యాటకుల సొంతం చేసే దిశగా.. జిల్లా యంత్రాంగం పర్యాటక శాఖ ద్వారా అభివృద్ధి పనులకు నాంది పలికిందన్నారు. జనవరి నెలలో గండికోట ఉత్సవాల నిర్వహణకు మునుపే పూర్తికావాల్సిన ఎంట్రన్స్, వెలివేషన్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఎపిటిడిసి ఇంజనీర్లు, ప్రాజెక్ట్ కన్సల్టెంట్ లను ఆదేశించారు. ఈ సందర్భంగా గండికోట పర్యాటక కేంద్రం అభివృద్ధి పథకంలో భగంగా చేపట్టే అన్ని రకాల పనులకు సంబంధించి మ్యాపులను, డిజైన్లను పరిశీలించి పలు సూచనలు, సలహాలను.అందించారు. పనుల నాణ్యతతో ఎలాంటి రాజీ లేకుండా.. అన్ని రకాల పర్యటన ప్రాజెక్టులను చేపట్టాలని ఆదేశించారు. అత్యంత ప్రధాన్యతో నిర్వహిస్తున్న అభివృద్ధి పనులపై ప్రతివారం పనుల పురోగతిపై సమీక్షా సమావేశం నిర్వహించడం జరుగుతుందన్నారు. ఏపీ టూరిజం కార్పోరేషన్ తో ఏపీలో అమలు చేస్తున్న టూరిజం పాలసీలో భాగంగా పర్యాటక ప్రాజెక్టులకు పారిశ్రామిక హోదా కల్పిస్తున్నామన్నారు. గండికోట ప్రాంతాన్ని సాస్కి పథకం ద్వారా రూ.79 కోట్లతో అభివృద్ధి చేసి అద్భుతమైన పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం ప్రణాళికలు రూపొందించడం జరిగిందన్నారు. అందులో భాగంగానే పర్యాటకులు బస చేసేలా స్టార్ హోటళ్లు, ఇతర ఆకర్షణీయమైన నిర్మాణాలు చేపట్టడం జరుగుతోందన్నారు. టూరిస్టులను ఆకర్షించేలా గండికోట వద్ద వ్యూపాయింట్ తో పాటు, చారిత్రక వైభవాన్ని ప్రతిబింబించేలా శ్రీకృష్ణ దేవరాయలు విగ్రహాన్ని ఏర్పాటు చేస్తున్నామన్నారు. గార్జ్ పరిసరాల్లో ఎకో ఫ్రెండ్లీ టెంట్ సిటీ, బోటింగ్ తో పాటు కోట వద్ద లైటింగ్ తదితర మౌలిక సదుపాయాలను కల్పిస్తున్నామన్నారు. ఈ ప్రాజెక్టు సందర్శించిన వారికి మంచి అనుభూతి కలిగేలా రోప్ వే, గ్లాస్ బాటమ్ వాక్ వే, లైట్ అండ్ సౌండ్ షోలను కూడా ఏర్పాటు చేస్తామన్నారు. ఈ ఏడాది చివరి కల్లా టెంట్ సిటీని కూడా ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు. గ్రాండ్ కాన్యన్ ను ఆకాశం నుంచి వీక్షించేందుకు హెలిరైడ్స్ సదుపాయం కూడా కల్పించనున్నట్లు తెలిపారు.

# ఘనంగా శ్రీ సత్యసాయి ఇనిస్టిట్యూట్ 44వ స్నాతకోత్సవం

## భగవాన్ బాబా విశిష్టమైన విద్యా విధానానికి ఇక్కడున్న విద్యార్థులంతా ప్రతిరూపాలు : సీఎం చంద్రబాబు నాయుడు






**పుట్టపర్తి పెన్ పవర్ నవంబర్ 22 :** భగవాన్ బాబా విశిష్టమైన విద్యా విధానానికి ఇక్కడున్న విద్యార్థులంతా ప్రతి రూపాలు అని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. శ్రీ సత్యసాయి ఇనిస్టిట్యూట్ ఆఫ్ హయ్యర్ లెర్నింగ్ 44వ స్నాతకోత్సవానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విలువల ఆధారిత, వ్యక్తిత్వ నిర్మాణమే కేంద్రంగా ఉన్న శ్రీ సత్యసాయి ఇనిస్టిట్యూట్ ఆఫ్ హయ్యర్ లెర్నింగ్ 44వ స్నాతకోత్సవానికి హాజరైనందుకు గౌరవంగా ఉందన్నారు. ఇవాళ పట్టభద్రులవుతున్న గ్రాడ్యుయేట్లందరికీ నా హృదయ పూర్వక అభినందనలు.భగవాన్ బాబా విశిష్టమైన విద్యా విధానానికి ఇక్కడున్న విద్యార్థులంతా ప్రతిరూపాలు అన్నారు. ఈ విద్యా విధానం విద్యార్థులను వృత్తిపరంగా సమర్థులుగా, సామాజిక బాధ్యత కలిగినవారిగా ఆధ్యాత్మిక స్పృహ కలిగిన వ్యక్తులుగా సంస్థ తీర్చిదిద్దింది. సత్యసాయి ఒక ఉద్దేశ్యంతో ఈ లోకానికి వచ్చారు. ఒక ఉద్దేశ్యం కోసమే జీవించారు... మన కోసం 'సాయి సిద్ధాంతాన్ని' ఇచ్చి వెళ్లారు. బోధనా మాధ్యమం క్రమశిక్షణ, ప్రేమ అనేవి విద్యార్థులకు ఫస్ట్, సెకండ్, థర్డ్ లాంగ్వేజీలన్నీసేవే అని సత్య సాయి బాబా చెప్పారు. ఇప్పుడు పట్టభద్రులు అయిన వారంతా నిస్వార్థ సేవ, కరుణ నిజాయితీ అనే విలువలను ఆచరించాలి. భారతదేశం వేల సంవత్సరాలుగా తన ఆధ్యాత్మిక జ్ఞానాన్ని ప్రపంచంతో పంచుకుంటోంది. వసుధైక కుటుంబము” - అంటే “ప్రపంచమంతా ఒకే కుటుంబం” అనేది శాశ్వత సందేశం... మన సంస్కృతికి గుండెకాయ వంటిదన్నారు. శ్రీ సత్యసాయి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హయ్యర్ లెర్నింగ్ సంస్థ విద్యాభ్యాసంతో పాటు నీతి, విలువలను కూడా మిళితం చేస్తుందన్నారు. సైన్స్, టెక్నాలజీ, ఆర్ట్స్ వంటి రంగాల్లో నైపుణ్యంతో పాటు, సామాజికంగా ఉపయోగపడే పరిశోధనలపై ఇక్కడ బలమైన ప్రాధాన్యత ఉంది. శ్రీ సత్యసాయి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హయ్యర్ లెర్నింగ్ సంస్థ సాయి సిద్ధాంతాన్ని, సూత్రాల ద్వారా అత్యుత్తమ యువ మేధావులను తీర్చిద్దిందన్నారు. 21వ శతాబ్దం భారతదేశానిది... 1991లో ఆర్థిక సంస్కరణలు ప్రారంభమయ్యాయి. 1990ల మధ్యలో సాంకేతిక పురోగతి అనేది ప్రారంభమైంది. ఇది హైదరాబాద్‌తో సహా అనేక నగరాలను ప్రపంచ ఐటీ హబ్‌లుగా మార్చిందన్నారు. ఈ రోజు భారతదేశానికి అధిక జనాభా వల్ల ప్రయోజనాలు కలుగుతున్నాయి. ఇది మనకు అద్భుతమైన ఫలితాలను ఇస్తుం దన్నారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ తరువాయి 4లో..

## అంగన్వాడీ కేంద్రాల్లో ఎలాంటి సంఘటనలు పునరావృతం కాకూడదు

**– జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా**






**నంద్యాల,పెన్ పవర్ నవంబరు, 22 :** అంగన్వాడీ కేంద్రాల ద్వారా చిన్నారులకు తల్లిలాంటి ప్రేమను అందజేయాలని సిడిపిఓ, సూపర్వైజర్లను జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి ఆదేశించారు. శనివారం కలెక్టరేట్ లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో స్త్రీ, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలోని కీ పెర్ఫార్మెన్స్ ఇండికేటర్స్, అపార్ ఐడి, అభా ఐడి, ప్రీస్కూల్ అటెండెన్స్ తదితర అంశాలపై సిడిపిఓలు, సూపర్వైజర్లతో జిల్లా కలెక్టర్ సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఐసిడిఎస్ పిడి లీలావతి, జిల్లా కోఆర్డినేటర్ అశోక్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక సమావేశాల్లో ఎక్కువ శాతం విద్య, ఆరోగ్యం, స్త్రీ శిశు సంక్షేమ శాఖకు ఎక్కువ శాతం బడ్జెట్ కేటాయించడం జరుగుతోందన్నారు. ఈ అంశాన్ని బట్టి ప్రభుత్వాలు స్త్రీ శిశు సంక్షేమ శాఖకు ప్రభుత్వం ఎంతో ప్రాధాన్యత ఇస్తుందో తెలుసుకోవాలన్నారు. అంగన్వాడీ కేంద్రాల ద్వారా గర్భిణీ స్త్రీలకు, పాలిచ్చే తల్లులకు ఎన్నో వేల కోట్ల రూపాయలతో పోషక విలువలతో కూడిన ఆహార పదార్థాలు అందజేయడం జరుగుతుందన్నారు. అంగన్వాడీ కేంద్రాల ద్వారా పిల్లలకు అందించే ఆహారం వల్ల దేశ అభివృద్ధికి ఎంతగానో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. అంగన్వాడీ కేంద్రాల్లో మెరుగైన మౌలిక సదుపాయాలు ఉండాలని, అంతేకుండా పరిసరాలతో పాటు టాయిలెట్స్ పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. అంగన్వాడీ కేంద్రాల్లోని పిల్లలకు తాజా కాయగూరలతో పాటు వారి వయస్సును బట్టి విలువలతో కూడిన విద్యను చిన్నారులకు అందించాలని, వాటి ద్వారా పిల్లలు ఉత్సాహవంతులుగా ఎదిగే అవకాశం ఉంటుందన్నారు. టీనేజ్ గర్భాలకు సంబంధించి బనగానపల్లె, డోన్, ఆళ్లగడ్డలో ఎక్కువ శాతం కేసులు నమోదు అవుతున్నాయని వాటిపై ప్రత్యేక దృష్టి సారించాలని సిడిపిఓలను కలెక్టర్ ఆదేశించారు. అంగన్వాడీ కేంద్రాల ద్వారా 6 నెలల నుండి 3 సం.లు, 3 సం.ల నుండి 6 సం.ల వయస్సు ఉన్న పిల్లలు ఎంత మంది ఉన్నారు అనే వివరాలను సోమవారం సాయంత్రం నాటికి తరువాయి 4లో..

# ఆధ్యాత్మిక సంస్థలు దేశ నిర్మాణానికి కీలక సహకారం అందించగలవు : రాష్ట్రపతి



**పుట్టపర్తి, పెన్ పవర్ నవంబర్ 22 :** శ్రీ సత్యసాయి బాబా శత జయంతి వేడుకలను పురస్కరించుకొని ఈరోజు (2025 నవంబర్ 22) ఆంధ్రప్రదేశ్ పుట్టపర్తిలోని ప్రశాంతి నిలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశానికి భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము హాజరయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్రపతి మాట్లాడుతూ.. పురాతన కాలం నుంచి మన సాధువులు, ఋషులు వారి చర్యలు, మాటల ద్వారా సమాజా నికి మార్గనిర్దేశం చేస్తున్నారని అన్నారు. ఈ మహాత్ములు సమాజ సంక్షేమం కోసం అనేక పనులు చేశారని.. అటువంటి గొప్ప వ్యక్తులలో శ్రీ సత్యసాయి బాబా ఒక ప్రత్యేక స్థానాన్ని కలిగి ఉన్నారని పేర్కొన్నారు. ఆయన ఎల్లప్పుడూ సమాజ సంక్షేమం కోసం పని చేశారని అన్నారు. 'మానవ సేవయే మాధవ సేవ' అనే నమ్మకాన్ని శ్రీ సత్యసాయి బాబా ప్రధానంగా తెలియజేస్తూ.. ఈ ఆదర్శాన్ని అనుసరించమని భక్తులకు సూచించారని తెలిపారు. ఈ విధంగా ఆయన ఆధ్యాత్మికతను ప్రజా సంక్షేమం వైపు మళ్లించా రని వ్యాఖ్యానించారు. ఆయన ఆధ్యాత్మికతను నిస్వార్థ సేవ, వ్యక్తిగత పరివర్తనతో మేళవించారన్న ఆమె.. కోట్లాది మందిని సేవా మార్గాన్ని అనుసరించేతి ఆయన ప్రేరేపించారని అన్నారు. ఆదర్శాలను ఆచరణ లోకి తీసుకొచ్చేందుకు శ్రీ సత్యసాయి బాబా అనేక సామాజిక సంక్షేమ కార్యక్రమాలను చేపట్టారని రాష్ట్రపతి అన్నారు. విద్యార్థులకు అత్యుత్తమ నాణ్యత గల ఉచిత విద్యను శ్రీ సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ అందిస్తోందని పేర్కొన్నారు. ఇది విద్యా నైపుణ్యాన్ని వ్యక్తిగత వికాసంతో మిళితం చేస్తుందని అన్నారు. విద్యతో పాటు నాణ్యతతో కూడిన ఉచిత వైద్య సంరక్షణ ద్వారా కూడా సత్య సాయి బాబా లక్ష్యం ముందుకు సాగుతోందని ఉద్ఘా టించారు. ఈ ప్రాంతంలోని వేలాది కరువు పీడిత గ్రామాలకు తాగునీటిని అందించడం కూడా ఆయన దార్శనికత అందించిన ఫలితమేనని ఆమె పేర్కొన్నారు. సత్యసాయి బాబా సందేశాలైన 'అందరినీ ప్రేమించు.. అంద రికీ సేవ చేయి', 'ఎల్లప్పుడూ సహాయం చేయి.. ఎప్పుడూ బాధ పెట్టకు' అనేవి శాశ్వతమైనవి, సార్వత్రికమైనవని రాష్ట్రపతి అన్నారు. 'ప్రపంచం మన పాఠశాల.. సత్యం, ధర్మం, శాంతి, ప్రేమ, అహింస అనే ఐదు మానవ విలువలు మన పాఠ్యాంశాలు' అని ఆయన నమ్మేవారని పేర్కొన్నారు. ఆయన బోధించిన మానవ విలువలు అన్ని సంస్కృతులకు, అన్ని కాలాలకు సరిపోతాయని అన్నారు. 'దేశమే ప్రథమం' అనే స్ఫూర్తికి అనుగుణంగా దేశ నిర్మాణం అనేది అన్ని సంస్థల కర్తవ్యం అని రాష్ట్రపతి అన్నారు. ఈ విషయంలో ఆధ్యాత్మిక సంస్థలు ముఖ్యమైన సహకారాన్ని అందించగలని తెలిపారు. ప్రజల జీవితాన్ని మరింత సులభతరం చేసేందుకు భారత ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంటోందని.. వీటి ద్వారా ప్రజలు ప్రతిభ,



సామర్థ్యాలను దేశాభివృద్ధి కోసం సద్వినియోగం చేసుకునే వీలు ఉంటుందని అన్నారు. ఈ దిశగా కేంద్ర ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలకు అన్ని ధార్మిక సంస్థలు, స్వచ్ఛంద సంస్థలతో సహా ప్రైవేటు రంగం, ప్రజలు సహకారించాలని ఆమె పిలుపునిచ్చారు. 2047 నాటికి భారత్‌ను అభివృద్ధి చెందిన దేశంగా మార్చాలనే లక్ష్యాన్ని సాధించటంలో ఇది సహాయపడుతుందని రాష్ట్రపతి అన్నారు.

## భావవ్యక్తీకరణ నైపుణ్యాలు అవకాశాలకు మార్గాలు

- బెంగళూరు ఎస్.ఇ.ఎ. కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ ప్రొఫెసర్ ఎస్.బి.అనిల్ కుమార్







**కడప పెన్ పవర్ నవంబర్ 22 :** భావవ్యక్తీకరణ నైపుణ్యాలు కలవారే ఉద్యోగ ఉపాధి అవకాశాలు ఎక్కడైనా సొంతం చేసుకోగలుగుతారని బెంగళూరు ఎస్.ఇ.ఎ. కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ మేనేజ్మెంట్ శాఖ అసోసియేట్ ప్రొఫెసర్ ఎస్.బి.అనిల్ కుమార్ అన్నారు. యోగి వేమన విశ్వవిద్యాలయం వాణిజ్యశాస్త్ర శాఖలో కమ్యూనికేషన్స్ స్కిల్స్ పై శనివారం వర్క్ షాప్ నిర్వహించారు. వర్క్ షాప్ ను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ సబ్జెక్టుకు సంబంధించి ఎంత విషయపరిజ్ఞానం ఉన్నప్పటికీ అది వెల్లడించే నైపుణ్యత లేకపోతే అవకాశాలు దూరమవుతాయన్నారు. ఉద్యోగాల కు దరఖాస్తు చేసేటప్పుడు బయోడేటా ప్రభావవంతంగా ఎలా తయారు చేయాలి, ఇంటర్వ్యూ మెళుకువలు వివరించారు.

వ్యక్తిత్వ లక్షణాలు, : సంభాషణా నైపుణ్యాలు, ప్రవర్తనా నైపుణ్యాల గురించి ఉదాహరణలతో వివరించారు. నాయకత్వ లక్షణాలు, విమర్శనాత్మక ఆలోచనలు, బాధ్యతా విలువలు ప్రతి ఒక్కరూ విద్యార్థి దశ నుంచే అలవర్చుకోవాలన్నారు. కామర్స్ శాఖ విభాగాధిపతి , వర్క్ షాప్ కన్వీనర్ ప్రొఫెసర్ ఎస్ రఘునాథరెడ్డి మాట్లాడుతూ ఇలాంటి వర్క్ షాప్ ల ద్వారా నైపుణ్యాలను గ్రహించి భవిష్యత్తు కోసం అభివృద్ధి చేసుకోవాలన్నారు. విద్యార్థుల సందేహ నివృత్తి చేశారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ విజయభారతి, విద్యార్థులు అధ్యాపకులు పాల్గొన్నారు.

## తరగతి గది బోధనలో ఏఐతో నూతన విప్లవం

### ఉపాధ్యాయులకు హ్యాండ్స్ ఆన్ శిక్షణా కార్యక్రమం





**మైదుకూరు, పెన్ పవర్ నవంబర్ 22 :** మైదుకూరు బాలుర ఉన్నత పాఠశాలలో, మైదుకూరు రెవెన్యూ డివిజన్ పరిధిలోని భౌతిక శాస్త్రం మరియు జీవశాస్త్రం ఉపాధ్యాయుల కోసం లి"ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అవగాహన మరియు హ్యాండ్స్%–ఆన్ ట్రైనింగ్ సెషన్"లిను శనివారం నిర్వహించారు. ఈ శిక్షణలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదుకూరు వృక్షశాస్త్ర అధ్యాపకులు డాక్టర్ పివి కృష్ణారెడ్డి రిసోర్స్ పర్సన్‌గా వ్యవహరించారు. కార్యక్రమంలో మాట్లాడుతూ డాక్టర్ పివి కృష్ణారెడ్డి, "శిక్షణ %–% బోధన విధానాలను ఆధునికీకరించడంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) కీలక పాత్ర పోషిస్తోంది. ఉపాధ్యాయులు ఏఐను వినియోగించడం ద్వారా పాఠ్య రచన, ప్రజెంటేషన్లు, విజువల్ మెటీరియల్ మరియు అంచనాలను వేగంగా, నాణ్యంగా రూపొందించుకోవచ్చు" అని పేర్కొన్నారు. తరగతి గదికి ఉపయోగపడే పలు ఏఐ టూల్స్‌ను ఉపాధ్యాయులకు ప్రత్యక్షంగా చూపించారు. గమ్మ ఏఐ: మొబైల్‌తోనే ఆకర్షణీయమైన పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ల తయారీ

పాఠాలు, ప్రశ్నాపత్రాలు, నోట్స్ ఆటోమేటిక్ సృష్టి
భిన్న స్థాయిల విద్యార్థుల కోసం పాఠ్య సరళీకరణ
ఉపాధ్యాయుల కోసం ప్రత్యేకమైన లెసన్ ప్లాన్స్, క్విజ్‌లు
నోట్స్ ఆర్గనైజ్ చేయడం, సారాంశాలు రూపొందించడం
పోస్టర్లు, ఇన్ఫోగ్రాఫిక్స్, డిజిటల్ కంటెంట్ తయారీ
పాఠశాల కార్యక్రమాల కోసం ఆడియో/సంగీతం రూపొందించడం

ఏఐను తరగతి గదిలో అనువర్తించటం ద్వారా విద్యార్థుల ఆసక్తి పెరుగుతుందని, ఉపాధ్యాయుల పని మరింత సమర్థవంతమవుతుందని ఆయన వివరించారు. కార్యక్రమంలో బాలుర ఉన్నత పాఠశాల హెచ్‌ఎం శ్రీ ఇస్మాయిల్, బాలికల ఉన్నత పాఠశాల హెచ్‌ఎం శ్రీమతి గంగాభవాని, ఉపాధ్యాయులు ఇస్మాయిల్, విద్యావతి, ప్రసన్నలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. పాల్గొన్న ఉపాధ్యాయులు ఈ శిక్షణ ఎంతో ప్రయోజనకరంగా ఉండిందని అభిప్రాయం వ్యక్తం చేశారు.

## నవంబర్ 24 నుంచి మీకోసం రైతన్న

### జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా




**నంద్యాల,పెన్ పవర్ నవంబర్ 22 :** భగవాన్ శ్రీ సత్యసాయిబాబా శత జయంతోత్సవాలను జిల్లా వ్యాప్తంగా అత్యంత వైభవంగా, ప్రభుత్వ అధికారిక కార్యక్రమంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లను చేయాలని జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి అధికారులను ఆదేశించారు. శనివారం జిల్లా కలెక్టర్ నిర్వహించిన టెలీకాన్ఫరెన్స్‌లో జిల్లా ఉన్నతాధికారులు, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి మాట్లాడుతూ ఈ ఏడాది భగవాన్ శ్రీ సత్యసాయి బాబా శత జయంతి సందర్భంగా ప్రతి మండలం, నియోజకవర్గం, జిల్లా స్థాయిలో శ్రీ సత్యసాయి సేవా సంఘాల సహకారంతో ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసుకోవాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వం అధికారిక గుర్తింపు కల్పించిన ఈ ఉత్సవాల్లో ప్రజలందరూ పాల్గొని, భక్తి, సేవామయ వాతావరణాన్ని సృష్టించేందుకు కృషి చేయాలన్నారు. ఈ ఉత్సవాల ద్వారా ప్రజల్లో భక్తి, సేవా భావనలు మరింత పెంపొందించేందుకు ప్రయత్నించాలని కలెక్టర్ సూచించారు. ఉత్సవాల పర్యవేక్షణలో జిల్లా యంత్రాంగం, మండల అధికారులు పటిష్టమైన చర్యలు తీసుకుని ప్రతి అంశాన్ని నాణ్యంగా అమలు చేయాలన్నారు.

"మీకోసం రైతన్న" రైతుల అభ్యున్నతికి దోహదపడే మీకోసం రైతన్న కార్యక్రమాన్ని ఈ నెల 24వ తేదీ నుంచి ప్రారంభించేందుకు పటిష్ట చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. నీటి భద్రత, డిమాండ్ ఆధారిత పంటల సాగు, అగ్రిటెక్, ఫుడ్ ప్రాసెసింగ్, ప్రభుత్వ మద్దతు వంటి కీలక అంశాలపై రైతుల్లో అవగాహన పెంపొందించేందుకు ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక చేపట్టాలన్నారు. వ్యవసాయ, ఉద్యాన శాఖ అనుబంధ రంగాల అధికారులతో పాటు గ్రామ సచివాలయ సిబ్బందితో మూడు ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసి, రోజుకు కనీసం 30 మంది రైతులను ప్రత్యక్షంగా కలిసి చైతన్యవంతులను చేయాలన్నారు. రైతులను కలిసినప్పుడు ముఖ్యమంత్రి సందేశాన్ని చదివి వినిపించడంతో పాటు, ప్రస్తుత పాటించాల్సిన పంటల పద్ధతులు, అగ్రిటెక్ వినియోగం, ప్రభుత్వ పథకాల వివరాలను వివరించాలని ఆదేశించారు. రైతుసేవా కేంద్రాల ఆధ్వర్యంలో ప్రతి రైతుకు ప్రభుత్వ పథకాల వివరాలు, సాంకేతిక వనరులు తెలియజేసి, వారి సమస్యలకు తక్షణ పరిష్కార చర్యలు తీసుకోవాలని సూచించారు. "జిల్లాలో జరుగుతున్న శ్రీ సత్యసాయి శత జయంతి ఉత్సవాలు, మీకోసం రైతన్న వంటి ప్రజా సంక్షేమ కార్యక్రమాలు ప్రజల జీవితాల్లో ఆధ్యాత్మికతతోపాటు అభివృద్ధి దిశగా మార్పుని తీసుకురావాలన్నారు. జిల్లా ప్రజలంతా, అధికారులు, రైతులు సమన్వయంతో ముందుకు వచ్చి ఈ ఉత్సవాలు, సంక్షేమ కార్యక్రమాలను విజయవంతం చేయాలని కలెక్టర్ పిలుపునిచ్చారు.

## అర్జీల పట్ల జిఆర్ఏలు భాధ్యతాయుతంగా స్పందించాలి..!

### జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి





**కడప, పెన్ పవర్ నవంబర్ 22 :** అర్జీదారులు, ఫిర్యాదుదారుల సమస్యలపై జిఆర్ఏ (గ్రీవిన్స్ రిడ్రెసల్ అథారిటీ) అధికారి బాధ్యతాయుతంగా, సానుకూల దృక్పథంలో స్పందించగలిగినపుడే.. ప్రజల సమస్యలను పెండింగ్ లేకుండా సమర్థవంతంగా పరిష్కరించగలమని జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి సంబందిత అధికారులకు సూచించారు. శనివారం కలెక్టరేట్ లోని బోర్డు మీటింగ్ హాలులో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్) లో వచ్చిన ఫిర్యాదుల పెండెన్సీ, జీఆర్ఏ ప్రతిస్పందనలపై జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి.. జేసీ అదితి సింగ్, డిఆర్వో విశ్వేశ్వర నాయుడు, ఎస్డీసిలు వెంకటపతి, రంగస్వామి లతో కలిసి.. సీఎంవో పిజిఆర్ఎస్ జిల్లా ఇంచార్జి సరళ, అన్ని డివిజన్ల రెవెన్యూ అధికారులుతో ఫిర్యాదుల పరిష్కారం, ఆడిట్ అంశాలకు సంబంధించి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... పిజిఆర్ఎస్ ద్వారా అందిన ఫిర్యాదుల పట్ల పరిష్కార నివేదిక అందివ్వడంలో.. గ్రీవెన్స్ రిడ్రెసల్ అథారిటీ బాధ్య అధికారులు బాధ్యతగా వ్యవహరించాలన్నారు. పొంతనలేని సమాధానాలు అర్జీదారులకు అందివ్వకూడదని, అర్జీదారుడు అందించే ఫిర్యాదుకు.. సరైన, సూటి సమాధానం ఇవ్వాలన్నారు. ఫిర్యాదు అందిన 24 గంటల్లోగా సంబందిత జిఆర్ఏ కచ్చితంగా ఎండార్స్మెంట్ చర్యలు చేపట్టాలన్నారు. ఫిర్యాదుల ప్రయారిటీ, ఫ్లాగ్ నోట్ చేయడంలో, సంబంధిత డాక్యుమెంట్లు అప్ లోడ్ చేయడంలో ప్రత్యేక దృష్టి సారించాలి. ఈ విషయంలో తహసీల్దార్లు శాఖాధిపతులు ఎల్లపుడు పైస్థాయి అధికారులు, పిజిఆర్ఎస్ సిబ్బంది, ఫిర్యాదుదారులు సమాచారం అందిపుచ్చుకునేలా అందుబాటులో ఉండాలని, ఎక్కడా కమ్యూనికేషన్ గ్యాప్ లేకుండా చేసుకోవాలన్నారు. కార్యాలయ వ్యవస్థను పదిలం చేయడంలో ప్రధాన భూమిక పోషించాలన్నారు. ప్రభుత్వం ద్వారా మనం చేసే ప్రతి పనీ.. ప్రభుత్వ అధికారులు, ప్రజాప్రతినిధులకు మంచి పేరు వచ్చేలా చేపట్టాలన్నారు. అన్ని శాఖల్లో ఫిర్యాదుల పెండెన్సీ నమోదుకు వచ్చే నెల లోపు "0" స్థాయిలోకి వచ్చేలా పునఃపరిశీలించి ఫిర్యాదులను పరిష్కరించాలన్నారు. పిజిఆర్ఎస్ ఫిర్యాదుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే.. శాఖాపరమైన చర్యలు తప్పవని జిల్లా కలెక్టర్ హెచ్చరించారు. ఈ సందర్భంగా.. పబ్లిక్ గ్రీవిన్స్ రీ అడ్రసల్ సిస్టమ్ లో భాగంగా ఆయా మండలాల ఫిర్యాదులను నమోదు చేస్తున్న పిజిఆర్ఎస్ సిబ్బందితో.. జిల్లా కలెక్టర్ మాట్లాడి.. ఫిర్యాదులపై స్పందన, పరిష్కార వేదిక ద్వారా తరచూ ఎదురయ్యే సమస్యలు, ఇబ్బందులను తెలుసుకుని సలహాలు, సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో విసి ద్వారా జెడ్పి సీఈవో ఓబులమ్మ, కడప, జమ్మలమడుగు, బద్వేలు, పులివెందుల రెవెన్యూ డివిజన్ల ఆర్డీవోలు జాన్ ఇర్విన్, సాయిశ్రీ, చంద్రమోహన్, చిన్నయ్య, డిఎస్పీ కరీం, అన్ని మండలాల తహశీల్దార్లు, బోర్డు మీటింగ్ హాలులో పిజిఆర్ఎస్ కంట్రోల్ రూం ఇంచార్జి సురేష్ కుమార్, శిరీష, ఎఫ్ సెక్షన్ సూపరింటెండెంట్ మాధవ రెడ్డి, పిజిఆర్ఎస్ మండల కో ఆర్డినేటర్లు తదితరులు పాల్గొన్నారు.

## అరటి పంట మార్కెట్ ధర తగ్గడంపై..

## జిల్లా జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ క్షేత్ర స్థాయిలో పరిశీలన





**అనంతపురం పెన్ పవర్ నవంబర్–22 :** జిల్లాలో 2025 గాను అధికంగా 38,984 ఎకరాలలో రైతులు అరటి సాగు చేపట్టారు. ఇది గత సంవత్సరం 2024 సాగు విస్తీర్ణం 27,365 కంటే 30% అధికం. 2024 సంవత్సరంలో అధిక ధర కారణంగా ఎక్కువ మంది రైతులు అరటి సాగు చేపట్టారు. అంతేకాకుండా మహారాష్ట్ర, ఉత్తర ప్రదేశ్ మరియు మధ్యప్రదేశ్ వంటి ఉత్తర భారత దేశ రాష్ట్రాలలో కూడా అధిక విస్తీర్ణం సాగులో ఉన్నది. దీని కారణంగా గత సంవత్సరం కంటే ధరలు తగ్గుముఖం పట్టినవి గత నెల వరకు ఇతర దేశాలకు ఎగుమతులు ఉండడం కారణంగా మొదటి పంట కడప జిల్లా అరటికి టన్ను 15000 రూపాయలు గరిష్టంగా నమోదైనది. దాని కారణంగా అనంతపురం జిల్లా నందు కూడా రెండవ పంటకు 7000 రూపాయలు ఒక టన్నుకు నమోదైనది. ప్రస్తుతం ఆ రెండో పంట అనంతపురం జిల్లాలో 14789 ఎకరాలు సాగులో ఉన్నది. ఇందులో ఇప్పటివరకు కోత అయిపోయిన విస్తీర్ణం 12089 ఎకరాలు ఇంకా మిగిలినది రెండవ కోత పంట 1900 ఎకరాల మాత్రమే దీని నవంబర్ నెలలో 7500 టన్నులు మరియు డిసెంబర్ నెలలో 21 వేల టన్నులు కోతకు రావాల్సి ఉన్నది. అనంతపురం జిల్లాలో అరటి 30 శాతం లోకల్ మార్కెట్ కి అదేవిధంగా 30 శాతం దూర ప్రాంతాలకు 40 శాతం ఇతర దేశాలకు ఎగుమతి అవుతున్నది, అదేవిధంగా కేజీ ధర లోకల్ మార్కెట్ నందు మూడు నుంచి నాలుగు రూపాయలు ఉన్నది .ఎగుమతి ధర 7 నుంచి 8 రూపాయలు ఉన్నది వ్యత్యాసం అయితే మూడు నుంచి నాలుగు రూపాయలు ఉన్నది. దీనికి ముఖ్య కారణం విస్తీర్ణం ఎక్కువగా ఉత్తర భారతదేశంలో ఉన్నది ముఖ్యంగా మహారాష్ట్ర, ఉత్తర ప్రదేశ్ ,మధ్యప్రదేశ్ మొదలైన రాష్ట్రాలలో అరటి ఎక్కువగా దొరకడం వల్ల ఎగుమతి దారులు అనంతపురం వైపు రావడం లేదు అదేవిధంగా ఎగుమతి దారులకు రవాణా ఖర్చులు మహారాష్ట్ర పోలిస్తే ఇక్కడ రెండింతలు ఖర్చు అవుతుంది, కావున ఎగుమతి దారులు అనంతపురం రావడానికి సుముఖంగా లేరు.అదేవిధంగా ఈరోజు గౌరవ జిల్లా జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ గారు గొంది రెడ్డి పల్లె గ్రామం, రాప్తాడు మండలంలో సీనప్ప అనే రైతు సాగు చేసిన అరటి పంటను క్షేత్రస్థాయిలో పరిశీలించడం జరిగింది. దీనిలో ముఖ్యంగా రైతు మూడు ఎకరాలు రెండవ పంట తొలగించడం జరిగినది మరియు ఒకటిన్నర ఎకరా మొదటి పంట కలదు , దీనికి ప్రధాన కారణం గిట్టుబాటు ధర లేకపోవడం వల్ల అదేవిధంగా ఎక్కువ రోజులు పంట పొలంలో ఉన్నట్లయితే ఫ్రూట్ ఫ్లై డామేజ్ ఎక్కువగా ఉంటుంది ఈ డ్యామేజ్ ప్రధాన పంట కూడా సోకే అవకాశం ఉందని రైతు పంట తొలగించడం జరిగింది. ఈరోజు ఇదే గ్రామం నందు కేజీ 3.50/– రూపాయలు ఒక రైతు నుండి మరియు రూ' 5.50/– మరియొక రైతు పొలము నుండి దళారులు కొనడం జరిగినది జాయింట్ కలెక్టర్ సార్ మాట్లాడుతూ ప్రభుత్వానికి నివేదిక పంపి అరటి సాగు చేస్తున్న రైతులకు గిట్టుబాటు ధర తోపాటు రైతులను అన్ని విధాలుగా ఆదుకునేలా చర్యలు తీసుకుంటాము అని తెలియజేయడం జరిగింది.మరియు ఎగుమతులు పెంచడానికి అవసరమైన లాజిస్టిక్స్ సహకారమను రైలు శాఖ ద్వారా ప్రయత్నం చెస్తునాము అని జాయింట్ కలెక్టర్ సార్ తెలియజేశారు.

## రాష్ట్ర కాంగ్రెస్ కార్యాలయంలో ఏపీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షులు : షేక్ మస్తాన్ వలి




**విజయవాడ పెన్ పవర్ నవంబర్ 22 :** దేశంలో జరుగుతున్న విధ్వంసకర ఆలోచనా విధానాలకు వ్యతిరేకంగా దేశ నిర్మాణం కోసం, జాతీయ అభివృద్ధి కోసం ఎన్నో బలిదానాలు, త్యాగాలు చేసిన చరిత్ర కలిగిన కాంగ్రెస్ పార్టీ ప్రజల్ని జాగృతం చేయడం కోసం ఈ కార్యక్రమాన్ని చేపట్టడం జరిగిందని ఏపీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షులు శ్రీ షేక్ మస్తాన్ వలి గారు అన్నారు. భారత దేశానికీ స్వతంత్రం వచ్చేనాటికి వున్న జనాభాలో కనీసం ఆహార ధాన్యాలు కూడా పండించుకోలేని పరిస్థితులలో ఉండేది. ఎక్కువమంది ప్రజలు అనేక రోగాలతో సతమతమవుతూ కనీస వైద్యం కూడా చేయించుకోలేని పరిస్థితుల్లో ఉండేవారు. అటువంటి భారత దేశాన్ని మొదటి ప్రధానిగా శ్రీ జవహర్ లాల్ నెహ్రూ గారు అనేక విధివిధానాలతో బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా ప్రణాళికలు తీసుకువచ్చి భారత దేశాన్ని పటిష్ట స్థితికి తీసుకువచ్చారు.

నాటి కాంగ్రెస్ ప్రభుత్వం బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా పోరాటం చేసి భారత జాతిని అభివృద్ధిపథం లోకి తీసుకువస్తే నేడు నరేంద్రమోడీ ప్రధాని అయిన తరువాత బిజెపి ప్రభుత్వం భారత దేశాన్ని విధ్వంస పాలన వైపు తీసుకువెళుతుంది. మతోన్మాదం అనే మత్తులోకి దేశాన్ని తీసుకువెళుతున్నారు. దీనికి వ్యతిరేకంగా భారత జాతికి న్యాయం జరగాలనే ఆలోచనతో అందరిని ఏకతాటిపైకి తెచ్చే ఉద్దేశ్యంతో శ్రీ రాహుల్ గాంధీ గారు భారత్ జోడో యాత్ర చేపట్టడం జరిగింది. నరేంద్ర మోడీ గారు ఆయన మిత్రులకు దేశ సంపదను దోచిపెడుతున్నారు. ఎన్నికల కమిషన్ అధికారాలను బంధించేసి ఎన్నికల ప్రక్రియలో మోసాలకు పాల్పడుతు న్నారు. దేశవ్యాప్తంగా జరిగిన ఓట్ల అవకతవకలపై కాంగ్రెస్ పార్టీ ప్రశ్నిస్తుంటే, బిజెపి ప్రభుత్వం రాహుల్ గాంధీ గారి అఫిడవిట్ పై ప్రశ్నిస్తున్నారు. ప్రజా సమస్యలపైనా, దేశ అభివృద్ధిపైనే మాట్లాడటం మానేసి రాహుల్ గాంధీ గారి అఫిడవిట్ పైన మాట్లాడుతున్నారు. కార్యక్రమం ద్వారా రాష్ట్రవ్యాప్తంగా ప్రతి జిల్లాలోని అన్ని అసెంబ్లీ నియోజకవర్గాలలో పర్యటించి ప్రజా అభిప్రాయాలను, %చీ+హా% ల అభిప్రాయాలను సేకరించి జిల్లాల్లో కొత్త నాయకులను తయారుచేసేందుకు రూపొందించబడింది. ఈ పత్రిక సమావేశంలో ఏఐసిసి సంయుక్త కార్యదర్శి–ఆంధ్రప్రదేశ్ డా. పాలక్ వర్మ, కొలనుకొండ శివాజీ, శ్రీ వి.గురునాథం, గంగిశెట్టి ఉమా శంకర్, శ్రీ నరహరశెట్టి నరసింహ రావు, పి.వై. కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

## చామకాలుకు కేటాయించిన స్థలాన్ని పరిశీలించిన జెసి కొల్లా బత్తుల కార్తీక్





**నంద్యాల, పెన్ పవర్ నవంబర్ 22 :** నంద్యాల పట్టణంలోని చామకాలువకు కేటాయించిన భూమిని కొంతమంది ఆక్రమ దారులు ఆక్రమించుకుంటు న్నారనే ఫిర్యాదులు రావడంతో శనివారం జాయింట్ కలెక్టర్ కొల్లా బత్తుల కార్తీక్ చామకాలువకు కేటాయించిన స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ కొల్లా బత్తుల కార్తీక్ మాట్లాడుతూ....గతంలో చామకాలువకు వరద నీరు వచ్చిన సమయంలో నంద్యాల పట్టణంలోని పలు ప్రాంతాలు ముంపుకు గురయ్యాయి. దీంతో చామకాలువకు రక్షణ గోడ ఏర్పాటు చేసేందుకు కాలు ఆనుకుని భూసేకరణ చేయడం జరిగింది. ఈ భూమిని కొంతమంది ఆక్రమించుకుంటున్నారన్న ఫిర్యాదు రావడంతో వెంటనే జాయింట్ కలెక్టర్ ఆ ప్రాంతాన్ని రెవెన్యూ సిబ్బందితో కలిసి పరిశీలించారు. ఇక్కడ ఎటువంటి ఆక్రమణలు జరగడానికి వీలు లేకుండా తగు చర్యలు తీసుకోవాలని రెవెన్యూ అధికారులకు తెలిపారు. మరియు మున్సిపల్ కార్యాలయం వెనుక వైపు ఉన్న సర్వే నెంబర్ 415 నందు 50 సెట్ల స్థలంలో ఇస్కాన్ వారు టెంపుల్ నిర్మించేందుకు స్థలం కావాలని కోరడం జరిగిందన్నారు. ఈ స్థలాన్ని కూడా జాయింట్ కలెక్టర్ పరిశీలించి రెవెన్యూ అధికారులకు తగు సూచనలు సలహాలు ఇచ్చారు.

## ఘనంగా శ్రీ సత్యసాయి ఇనిస్టిట్యూట్ 44వ స్నాతకోత్సవం

**(3వ పేజీ తరువాయి)** బలమైన నాయకత్వం మనకు ఉందన్నారు. ఈ అనుకూలతలన్నీ సద్వినియోగం చేసుకోవడం ద్వారా దేశం 10వ స్థానం నుంచి 4వ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఎదగడానికి ఉపయోగపడింది. 2047 నాటికి మనం ప్రపంచంలోనే నంబర్ వన్ దేశంగా అవతరిస్తాయన్నారు. దీనిని సాధించడానికి మనం భవిష్యత్తు రంగాలు అయిన ఎఐ–డేటా సెంటర్లు, క్వాంటం, ఏరోస్పేస్, డ్రోన్, అంతరిక్షం, సెమీకండక్టర్, రక్షణ రంగాలలోని పెట్టుబడులపై దృష్టి సారిస్తున్నాము. ప్రస్తుతం పునరుత్పాదక విద్యుత్ రంగానికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నామనాడ్ర. దేశంలో ఉన్న అన్ని ఫ్యూచర్ టెక్నాలజీలను ఏపీకి తెస్తున్నామన్నారు. సీఐఐ సదస్సులో రూ. 13.25 లక్షల పెట్టుబడులు తెచ్చాం... 16 లక్షల ఉద్యోగాలు రానున్నాయన్నారు. డేటా సెంటర్ కోసం 15 బిలియన్ డాలర్ల పెట్టుబడులను గూగుల్ పెట్టనుంది. వినూత్న ఆలోచనలకు వేదికగా ఆర్టీఐహెచ్ ఉంది. కొత్త ఆలోచనలతో వచ్చిన వారితో కంపెనీలు పెట్టేలా అన్ని అవకాశాలు కల్పిస్తున్నామన్నారు. ఇప్పుడు ఒన్ ఫ్యామ్లీ–ఒన్ ఎంటర్ ప్రెన్యూర్, ఒన్ ఫ్యామ్లీ–ఒన్ ఏఐ టెక్నిషీయన్ అనే సిద్ధాంతంతో పని చేస్తున్నాం. భారత దేశంలో తెలుగు వాళ్లు నెంబర్–1గా ఉండేలా పని చేస్తున్నాం. ప్రపంచానికి నాయకత్వం వహించేలా భారతదేశం ఎదగడానికి ఈ రంగాల ద్వారా మార్గం సుగమం చేసుకోవాలి. భవిష్యత్ కాలంలో ప్రస్తుతం విద్యార్థులు, నైపుణ్యమున్న యువతదే ముఖ్యమైన పాత్ర. విద్యార్థులు, యువతే దేశానికి సంరక్షకులు, ధైర్యంగా, ఆత్మవిశ్వాసంతో విలువలతో ఉండాలి. సాయి సిద్ధాంతం అమలు చేస్తూనే, సాంకేతికత, ఆవిష్కరణలను ఉపయోగించడం ద్వారా సంక్షేమానికి కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేయండి. బాబా తన బోధనలు, సందేశాలు, స్వచ్ఛంద స్ఫూర్తి అంతర్ దృష్టి ద్వారా ప్రపంచంలోని నలుమూలల ఉన్న లక్షలాది మందిని కోట్ల మందిని ప్రభావితం చేయగలిగారు. సాయి సిద్ధాంతాన్ని ఒక ఉద్యమంలా ముందుకు తీసుకెళ్లాలి. సాయి బాబా స్ఫూర్తితో వెల్తీ, హెల్తీ, హ్యాపీ సొసైటీని రూపొందించేలా కృషి చేయాలి. కోయంబత్తూరు గాంధీగా ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్‌కు పేరుంది. నిత్యం ప్రజలకు సేవ చేయాలని తపన పడుతూ ఉంటారు. ప్రస్తుతం సత్యసాయి జయంత్యుత్సవాలకు రాష్ట్రపతి, ఉప రాష్ట్రపతితో సహ రాజ్యాంగ బద్ధ పదవుల్లో ఉన్న వారంతా వచ్చారు... సత్యసాయి బాబా గొప్పదనం ఇది. పుట్టపర్తి అనేది సత్యసాయి బాబా ప్రవిత్ర భూమి అని వ్యాఖ్యానించారు.

## అంగన్వాడీ కేంద్రాల్లో ఎలాంటి సంఘటనలు పునరావృతం కాకూడదు

**(3వ పేజీ తరువాయి)** అందజేయాలని సిడిపిఓ, సూపర్వైజర్లను కలెక్టర్ ఆదేశించారు. సదరు డేటాను అనుసరించి ఆకస్మిక తనిఖీలు నిర్వహించడం జరుగుతోందన్నారు. అదే విధంగా రానున్న రోజుల్లో అంగన్వాడీ కేంద్రాలను బలోపేతం చేయడంపై దృష్టి సారించడం జరుగుతోందన్నారు. అంగన్వాడీ కేంద్రాల్లో ఎలాంటి సంఘటనలు పునరావృతం జరిగిన రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకునే అవకాశం ఉంటుందోని సిడిపిఓలు, సూపర్వైజర్లను కలెక్టర్ హెచ్చరించారు. అనంతరం సఖి వన్ స్టాప్ సెంటర్, మిషన్ వాత్సల్య, పత్రికల్లో వచ్చే ప్రతికూల వార్తలు తదితర అంశాలపై కులకుశంగా చర్చించారు. అదే విధంగా దత్తత ప్రక్రియకు సంబంధించిన పోస్టర్లను జిల్లా కలెక్టర్ ఆవిష్కరించారు.

### జిల్లాలో మత్స్యసంపద పెంచి

## మత్స్యకారుల జీవితాలలో వెలుగులు

- మత్స్యకారుల కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి చర్యలు
- జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా




**నంద్యాల, పెన్ పవర్ నవంబర్ 22 :** జిల్లాలోని మత్స్యకారుల సంక్షేమానికి ప్రత్యేకతలు తీసుకోవడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా పేర్కొన్నారు. శుక్రవారం కలెక్టరేట్లోని పిజిఆర్ఎస్ హాల్ నందు జిల్లా మత్స్యశాఖ వారి ఆధ్వర్యంలో ప్రపంచ మత్స్యశాఖ దినోత్సవాన్ని అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా మాట్లాడుతూ.... జిల్లాలో ఉన్న మత్స్యకారుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి వారి సంక్షేమానికి కృషి చేయడం జరుగుతుందన్నారు. నంద్యాల వ్యవసాయ అనుబంద శాఖలపైన ఆధారపడిన జిల్లా మన జిల్లాలో ఎక్కువగా హార్టికల్చర్, లైవ్ స్టాకు, అగ్రికల్చర్ తర్వాత ఆక్వారంగం ద్వారా జిల్లాకు జిడిపి ఎక్కువగా వస్తుందన్నారు. జిల్లాలో 65వేల మెట్రిక్ టన్నులు చాపల ఉత్పత్తి ఉందన్నారు. ఈ ఏడాది 80 వేల మెట్రిక్ టన్నులకు పెంచాలన్న ఆలోచనతో జిల్లా యంత్రాంగం ముందుకు వెళ్లడం జరుగుతుందన్నారు. జిల్లాలో 330 మైనర్ ఇరిగేషన్ ట్యాంకులు ఉన్నాయని కానీ 110 ట్యాంకులలోనే చేపల పెంపకం జరుగుతోందని చేపల పెంపకం రిజర్వాయర్లు చెరువుల ద్వారా పెంచితే మత్స్యకార కుటుంబాలకు జీవనోపాధి పెరిగి జిల్లా అభివృద్ధి సాధ్యమవుతుందని ఆ దిశగా చెరువులలో మరింత చేపల పెంపకం చేపట్టేందుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. జిల్లాలో ఉన్న ఫిష్ నర్సరీస్ ని అభివృద్ధి చేయడం జరిగిందని వచ్చే సంవత్సరానికి మరింత అభివృద్ధి చేసి జిల్లాకు కావలసిన చేపపిల్ల ఉత్పత్తిని మన జిల్లాలోనే జరిగి మత్స్యకారులందరికీ అందించడం జరుగుతుందన్నారు. మత్స్యకారులు సొసైటీలో సభ్యత్వం కావాలంటే ఐదు స్కిల్స్ ఉండాలని ఈ ఐదు స్కిల్స్ కు సంబంధించిన శిక్షణ కూడా ఫిసిరిస్ డిపార్ట్మెంట్ ద్వారా అందించి ఎక్కువ మందికి జీవనోపాధి కల్పించి వారి జీవితాలలో వెలుగులు నింపడం జరుగుతుందన్నారు. మన కులవృత్తినే మన సంప్రదాయ వృత్తి అనుకొని ఎప్పటికీ మర్చిపోకూడదన్నారు. మన కులవృత్తులను పాటిస్తూనే మన పిల్లలను చదువు వైపు ప్రేరేపించాలన్నారు. ప్రతి కుటుంబంలో ఒకరైనా చదువుకున్న వ్యక్తి ఉంటే ఆ కుటుంబం ఆర్థికంగా అభివృద్ధి చెంది ఆ కుటుంబం యొక్క రూపురేఖలు మారుతాయన్నారు. మత్స్యకారుల కోరిక మేరకు జిల్లాలో కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. కోస్టల్ వారికి ఇచ్చిన బెనిఫిట్స్ అన్ని కూడా మన జిల్లాలో ఇచ్చేందుకు ఇక్కడి పరిస్థితులను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి తగు చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. 50 సంవత్సరాలు పూర్తయిన మత్స్యకారులకు పెన్షన్లు ఇచ్చేందుకు ప్రభుత్వ నియమ నిబంధనలు పరిశీలించి తగు చర్యలు తీసుకుంటామన్నారు. చేపల్లో ఉన్నటువంటి ఆరోగ్యకరమైన ప్రోటీన్లు ఎక్కడ దొరకవన్నారు. మనుషుల్లో తెలివితేటలు, పిల్లల మెదడు చురుకుగా పనిచేయాలంటే, ఆరోగ్యంగా ఉండేందుకు ప్రతి ఒక్కరూ చేపలు తినాలన్నారు.

## 27 నుంచి పీజీ మూడో సెమిస్టర్ పరీక్షలు

**కడప పెన్ పవర్ నవంబర్ 22 :** యోగి వేమన విశ్వవిద్యాలయం, అనుబంధ పీజీ కళాశాలల మూడో సెమిస్టర్ విద్యార్థులకు ఈ నెల 27వ తేదీ నుంచి పరీక్షలు ప్రారంభం కానున్నాయని కంట్రోల్ ఆఫ్ ఎగ్జామినేషన్ ప్రొఫెసర్ కె ఎస్ వి కృష్ణారావు తెలిపారు. ఎం.ఎ, ఎం.కామ్, ఎం.ఎస్సీ, ఎం.పి.ఎడ్. మూడో సెమిస్టర్ పరీక్షల టైం టేబుల్ ను ఆయన ప్రకటించారు. ఈ నెల 27,29 డిసెంబర్ 1,3,5,8 తేదీల్లో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకూ పరీక్షలు ఉంటాయన్నారు.

# కడప జిల్లాలో పాడి పంట...

– డాక్టర్ రాంబాబు.. నంది మండలం




**కడప పెన్ పవర్ నవంబర్ 22 :** పశువులలో 'గొంతు వాపు వ్యాధి (HS)' మరియు 'లంపీ స్కిన్ డిసీజ్ (LSD)' పై సూచన ప్రస్తుత సీజన్లో పశువుల్లో తరచుగా కనిపించే రెండు ప్రధాన వ్యాధులు గొంతు వాపు వ్యాధి (హీమోర్రాజిక్ సెప్టీసీమియా– HS) మరియు లంపీ స్కిన్ డిసీజ్ (LSD). ఈ రెండు వ్యాధులు ఈ కాలములో వేగంగా వ్యాపించి పశువుల ప్రాణాలకు ముప్పు కలిగించే సామర్థ్యం కలిగి ఉంటాయి. పశు పోషకులు తప్పనిసరిగా జాగ్రత్తలు తీసుకుని సమయానికి టీకాలు వేయించుకోవాలని ప్రజలకు విజ్ఞప్తి చేస్తున్నాం. గొంతు వాపు వ్యాధి (HS): ముఖ్య లక్షణాలు

అకస్మాత్తుగా ఎక్కువ జ్వరం
గొంతు, తల, మెడ ప్రాంతాల్లో తీవ్రమైన వాపు
శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది
తక్షణ చికిత్స లేకపోతే అధిక మరణాలు
నివారణకు అత్యంత ప్రభావవంతమైన మార్గం: HS టీకా
లంపీ స్కిన్ డిసీజ్ (LSD): ముఖ్య లక్షణాలు
శరీరంపై అమ్మవారు వ్యాదిలాగా బొబ్బలు
జ్వరం, ఆకలి తగ్గడం
పాల ఉత్పత్తి తీవ్రంగా తగ్గడం

ఈగలు, దోమలు ద్వారా వేగంగా వ్యాపిస్తుంది.. నివారణ: నిర్దిష్ట LSD టీకా ం దోమల నియంత్రణ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల ప్రకారం– HS రిపీట్ & గోట్ పాక్స్ టీకాల పంపిణీ మరియు అమలు.. 25 నవంబర్ 2025 నుండి 15 డిసెంబర్ 2025 వరకు ఆంధ్రప్రదేశ్ పశుసంవర్ధక శాఖ రాష్ట్రవ్యాప్తంగా టీకాలు నిర్వహించనుంది. జిల్లాలన్నింటికి టీకాలు ఇప్పటికే పంపిణీ అయ్యాయి.

1. ఫీల్డ్ స్టాఫ్‌ను పై తేదీల్లో టీకాల కార్యక్రమం నిర్వహించేందుకు దిశా నిర్దేశం చేయాలి. 2. భారత్ పశుధన్ పోర్టల్‌లో అన్ని టీకాల వివరాలు రియల్ టైమ్‌లో నమోదు చేయాలి. 3. ప్రతి ఫిజికల్ టీకా పోర్టల్‌లో ఖచ్చితంగా అప్‌డేట్ అయినట్లు నిర్ధారించాలి. 4. సరఫరా చేసిన టీకాలను పూర్తిగా వినియోగించి వృథా కాకుండా చూడాలి. 5.అర్హత ఉన్న అన్ని పశువులను 100% కవరేజ్ చేయాలి. పశుపోషకులకు విజ్ఞప్తి మీ పశువుల ఆరోగ్య రక్షణ కోసం టీకాలు తప్పనిసరిగా వేయించుకోండి. సమీప పశువైద్యశాలను లేదా పశువైద్య అధికారులను సంప్రదించండి.

**డా. జి. రాంబాబు, పశు వైద్యాధికారి, నందిమండలం**

## కవయిత్రి మొల్ల సాహితీ పీఠానికి ఉత్తమ సేవా పురస్కార ప్రదానం!!




**బద్వేలు, పెన్ పవర్: నవంబర్ 22 :** మహాకవయిత్రి మొల్ల సాహిత్య పీఠం గతరెండు దశాబ్దాలుగా విభిన్న రీతులలో అకుంఠిత దీక్షతో కావించిన అవిరళ కృషికి గుర్తింపుగా పీఠం వ్యవస్థాపక అధ్యక్షులు, భారత రాష్ట్రపతి అవార్డు గ్రహీత విద్వాన్, డాక్టర్ ,గానుగ పెంట హనుమంతరావు, ప్రధాన కార్యదర్శి జీవీ మనోజ్ కుమార్ లకు ఉత్తమ సేవా పురస్కారం , ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ జి .లక్ష్మీశ, అవనిగడ్డ శాసనసభ్యులు డాక్టర్ మండలి బుద్ధ ప్రసాద్, ఆచార్య రాచపాలెం చంద్రశేఖర్ రెడ్డి తదితరుల చేతుల మీదుగా ప్రదానం చేశారు. శనివారం విజయవాడలోని తుమ్మలపల్లి క్షేత్రయ్య కళాక్షేత్రంలో ఎన్టీఆర్ జిల్లా ప్రభుత్వ యంత్రాంగం, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సృజనాత్మకత మరియు సంస్కృతి సమితి, మల్లెతీగ సాహిత్య సేవా సంస్థ నిర్వహణలో రెండు రోజులుగా చేస్తున్నజాతీయ సాంస్కృతిక ఉత్సవాలలో మొదటిరోజు ఈ పురస్కారం అందజేశారు. ఈ పురస్కారం క్రింద జ్ఞాపిక , రూ 10, 116 /బి పారితోషికం, శాలువ, ప్రశంసా పత్రంతో ఘనంగా సత్కరించారు. పీఠం పక్షాన అధ్యక్ష ,ప్రధాన కార్యదర్శులు హనుమంతరావు, మనోజ్ కుమార్లు మాట్లాడుతూ , 20 సంవత్సరాల సాహిత్య పీఠం కృషిని గుర్తించిన ఎన్టీఆర్ జిల్లా ప్రభుత్వ యంత్రాంగానికి, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సృజనాత్మకత మరియు సంస్కృతి సమితి కి, మల్లెతీగ సాహిత్య సేవా సంస్థ అధ్యక్షులు కలిమిశ్రీ, కార్యనిర్వాహక కార్యదర్శి చొప్పా రాఘవేంద్ర శేఖర్ తదితర సభ్యులకు కృతజ్ఞతలు తెలియజేశారు.

## స్వయం సహాయక సంఘాల జీవనోపాదులు పెరగాలి

**క్షేత్రస్థాయిలో ప్రణాళిక సిద్ధం చేయాలి : చిత్తూరు డిఆర్డిఏ పిడి శ్రీదేవి**




**చిత్తూరు పెన్ పవర్ నవంబర్ 22 :** జిల్లాలోని స్వయం సహాయక సంఘాల సభ్యుల జీవనోపాలు పెరిగేందుకు క్షేత్రస్థాయి సిబ్బంది కృషి చేయాలని చిత్తూరు డి ఆర్ డి ఏ పి డి శ్రీదేవి తెలిపారు. శుక్రవారం డిఆర్డిఏ సమావేశ మందిరంలో డిపిఎంలు ఏపీఎంలు సీసీలు ఇతర డిఆర్డిఏ సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పిడి మాట్లాడుతూ స్వయం సహాయక సంఘాల ఆర్థిక స్వాలంబన కోసం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అనేక సంక్షేమ పథకాలను చేపట్టాయని ఈ పథకాలన్నీ సంఘ సభ్యులకు చేరువ కావాలన్నారు. అనేక పథకాలు జిల్లాలోని వివిధ శాఖలతో ముడిపడి ఉన్న నేపథ్యంలో అన్ని శాఖలు సమన్వయం చేసుకొని తమ పరిధిలోని సంక్షేమ ఫలాలను సంఘ సభ్యులకు అందించేందుకు కృషి చేయాలన్నారు. అప్పుడే వారి జీవన ప్రమాణాలు మెరుగుపడతాయని దీని దృష్టిలో ఉంచుకొని క్షేత్ర స్థాయి సిబ్బంది ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. సంఘాల్లోని చదువుకున్న సభ్యులను గుర్తించి స్థానికంగా ఉన్న వనరులను సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా బలోపేతం అయ్యే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. అలాగే గ్రామాల్లో ఉన్న సాంఘిక దురాచారాల వల్లే చోటు చేసుకునే పరిణామాలను వివరించి వారిని చైతన్యపరిచి ఈ దురాచారాలను నియంత్రించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రధానంగా హార్టికల్చర్ పశుసంవర్ధక శాఖలు సంఘ సభ్యులకు అనేక పథకాలను అందించే అవకాశం ఉందని ఈ పథకాలన్నీ సంఘాలు సద్వినియోగం చేసుకునే విధంగా కృషి చేయాలన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు నిర్దేశించిన పథకాలు అర్హులైన ప్రతి సంఘానికి అందే విధంగా క్షేత్రస్థాయిలో అన్ని శాఖల తో సమన్వయం చేసుకోవాలన్నారు సంఘంలోని చదువుకుని సాంకేతిక రంగం పట్ల అవగాహన ఉన్న సభ్యులను గుర్తించి వారి ఎంచుకునే వ్యాపార రంగాలకు ప్రోత్సాహాన్ని అందించాలన్నారు. ఈ విషయంలో బ్యాంకర్లు తో చర్చించాలన్నారు. క్షేత్రస్థాయిలో అన్ని పథకాలను సంఘ సభ్యులు సద్వినియోగం చేసుకునే విధంగా ప్రణాళికలో సిద్ధం చేయాలని ఆదేశించారు. వెదురు మునగ సాగుకు ప్రాధాన్యత ఇవ్వాలని. సంఘ సభ్యులు రుణాల విషయంగా సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించే విధంగా వారిని తీర్చిదిద్దాలన్నారు.






"ఎవరైనా ఒక వివేకవంతుణ్ణి, అవివేకి అంటే, అతడు తన అవివేకాన్ని బయటపెట్టినట్లే!" ----- బాబూజీ

"If a person calls a wise person a fool, they expose their own foolishness!" ------ Babuji




# గరుడ వాహనంపై శ్రీ పద్మావతి అమ్మవారి కటాక్షం






**తిరుపతి పెన్ పవర్ నవంబర్ 22 :** తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారి కార్తీక బ్రహ్మోత్సవాల్లో ఆరో రోజైన శనివారం రాత్రి అమ్మవారు శ్రీవారి బంగారు పాదాలు ధరించి గరుడ వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. అశ్వాలు, వృషభాలు, గజాలు ముందు కదులుతుండగా, మంగళవాయిద్యాలు, భక్తుల కోలాటాల నడుమ ఆలయ నాలుగు మాడ వీధుల్లో రాత్రి 7 గంటలకు అమ్మవారి గరుడ వాహన సేవ ప్రారంభమైంది. భక్తులు అడుగడుగునా కర్పూర హారతులు సమర్పించి అమ్మవారిని దర్శించుకున్నారు. గరుడసేవ రోజున అమ్మవారికి శ్రీవారి స్వర్ణ పాదాలు అలంకరించడం ఆనవాయితీగా వస్తోంది. గరుడసేవ రోజున తిరుమలలో స్వామివారు తనకు అత్యంత ప్రీతిపాత్రమైన గరుత్మంతునిపై విహరిస్తారు. తిరుచానూరులో అమ్మవారికి గరుడ సేవ జరుగుతున్నపుడు శ్రీవారు తన గుర్తుగా అమ్మవారికి తన బంగారు పాదాలను పంపుతున్నారు. గరుడుడు నిత్యసూరులలో అగ్రేసరుడు. గరుడుని రెండు రెక్కలు జ్ఞాన వైరాగ్యాలకు చిహ్నాలుగా పురాణాలు చెబుతున్నాయి. శ్రీవారు, అమ్మవారిని గరుడాళ్వార్లు దాసుడిగా, చాందినీగా, ఆసనంగా, వాహనంగా సేవిస్తున్నారు. గరుడపచ్చను వక్షస్థలంలో అలంకారంగా ధరించే శ్రీవారు, పద్మావతీ సమేతంగా నిజసుఖాన్ని ప్రసాదిస్తారని పురాణాలు తెలియజేస్తున్నాయి. జ్ఞానవైరాగ్యాల్ని ప్రసాదించే గరుడ వాహన సేవలో అలమేలుమంగమ్మను దర్శించి సేవించినవారికి మోక్షం లభిస్తుందని భక్తుల విశ్వాసం. వాహనసేవలో తిరుమల శ్రీశ్రీశ్రీ పెద్దజీయర్ స్వామి, శ్రీశ్రీశ్రీ చిన్నజీయర్ స్వామి, ఈవో శ్రీ అనిల్ కుమార్ సింఘాల్, బోర్డు సభ్యులు శ్రీమతి సుచిత్ర ఎల్లా, శ్రీమతి పనబాక లక్ష్మి, సాంబశివరావు, జానకి దేవి, జేఈవో వి.వీరబ్రహ్మం, సివిఎస్ఓ కే.వి. మురళీకృష్ణ, ఆలయ డిప్యూటీ ఈవో శ్రీ హరీంద్రనాథ్, ఆలయ అర్చకులు శ్రీ బాబు స్వామి, శ్రీనివాస చార్యులు, అర్చకులు, ఇతర అధికారులు, విశేష సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

# జీవితమంటే.. మనకోసం మనం బతకడమే కాదు, ఇతరులకోసం జీవించడం...

– ఇంత చిన్న వయసులో ఎంత గొప్ప సంస్కారమో..

**కడప పెన్ పవర్ నవంబర్ 22 :** "ఏమండీ ! ఆ పేపరు చదవడం ఆపి ఇక్కడ మీ కూతురు చేస్తున్న పని చూస్తారా?" ... అరుస్తోంది రాధిక.

చదువుతున్న పేపరు పక్కన పడేసి లోపలికి వెళ్ళాడు ప్రదీప్... "ఏమిటీ ? ఏమయ్యిందీ..?" "దీనిచేత ఆ పెరుగన్నం తినిపించండి" గిన్నె నిండా చక్కని పెరుగన్నం. "మా పిల్ల ఎంత మంచిదో ! నాన్నకోసం నాలుగు ముద్దలు తినెయ్యమ్మా!" అంటూ డైనింగ్ టేబుల్ దగ్గరకి వెళ్తున్నాడు ప్రదీప్. సింధు ఏడుస్తూ కళ్ళల్లోంచి కారుతున్న కన్నీళ్ళని చేతుల వెనుక భాగంతో తుడుచుకుంటోంది. ఏదో నిర్ణయానికి వచ్చింది. "సరే నాన్న గారూ !నాలుగు ముద్దలు కాదు. అమ్మ పెట్టిన మొత్తం అన్నం తినేస్తాను. మరి నేను కోరింది ఇస్తారా?" అంటూ.. ఒట్టు వెయ్యమన్నట్టుగా చేతిని ముందుకు చాపింది. "ఒట్టు" అంటూ ఆ లేత గులాబీ చేతులలో తన చేతిని వేస్తూ ఇలా అన్నాడు ప్రదీప్... "నాన్నా ! నువ్వు నా దగ్గరుండే డబ్బులు గురించి దృష్టిలో పెట్టుకుని, కంప్యూటర్ లాంటి పెద్ద కోరికలు కోరకూడదు మరి. సరేనా?" అంటూ తన షరతు బయట పెట్టాడు. "సరే నాన్నా! నా కోరికకు పెద్దగా డబ్బులు ఖర్చు ఏమీ కావులే." అంటూ నెమ్మదిగా అయిష్టంగా పెరుగు అన్నం కష్ట పడి ముద్ద ముద్ద మింగ లేక మింగ లేక మింగుతూ ఉంటే... ప్రదీప్ తన అమ్మ వేపూ, భార్య రాధిక వేపూ కోపంగా చూస్తున్నాడు. ఎలాగో కష్టపడి మొత్తం గిన్నె ఖాళీ చేసేసింది సింధు. ప్రదీప్ దగ్గరకి చేరింది. ఆమె ఏమి చెబుతుందా అని ప్రదీప్ ఆత్రుతగా చూస్తున్నాడు. ఏదో గొంతెమ్మ కోరిక కోరుతుంది అనుకుంటూ రాధిక, ప్రదీప్ అమ్మగారూ కూడా సింధు కేసి చూస్తున్నారు. "నాన్నగారూ ! ఈ ఆదివారం నాకు గుండు చేయించాలి" "హవ్వ ! హవ్వ ! నీకిదేం పోయేకాలమే?" అంటూ బుగ్గల్లో పొడిచెయ్యబోయింది ప్రదీప్ అమ్మగారు. "చంపేస్తాను ముష్టిపీనుగా !" అరిచింది రాధిక. "మీ నాన్న బాగా గారాబం చేసి నిన్ను తలకి ఎక్కించుకుంటూ ఉంటే, ఇలాంటి ఛండాలపు బుద్ధులే పుడతాయి మరి. ఈ దరిద్రపుగొట్టు లక్షణాలు ఎక్కడ నేర్చుకున్నావే? ఏ వెధవ టి వి చానెల్ లోనో ఇదొక కొత్త ఫాషన్ అని చెప్పి చచ్చారా.. గుండు కొట్టించుకోవడం అంటే అర్థం తెలుసంటే నీకు...?" బామ్మ గారి సన్నాయి నొక్కులు. "నాన్నా సింధూ ! ఇది కాకుండా ఇంకేదైనా కోరుకోవచ్చు కదా ! నిన్ను జుట్టులేకుండా మేము చూడలేము తల్లీ!" బ్రతిమాలుతున్నట్టు అడిగాడు ప్రదీప్. అడ్డంగా తల ఊపింది సింధు. "నాన్నా ! ఆ పెరుగన్నం తినడం నాకు ఎంత అసహ్యమో మీకు తెలుసుకదా ! మీరు మాట ఇచ్చారని కదా నేను తినేశాను. ఇప్పుడు ఇలా అంటారేమిటి నాన్నా..? నువ్వే చెప్పావు కదా హరిశ్చంద్రుడి కథ. ఎన్ని ఇబ్బందులు వచ్చినా ఆడిన మాట ఆయన తప్పలేదు. నువ్వు తప్పుతావా నాన్నా?". ఒక్కసారిగా షాక్ తిన్నట్టు అనిపించింది ప్రదీప్ కి... "ఇచ్చిన మాట తప్పకూడదు" అది తను చెప్పిన మాటే !"నీకేదో పిచ్చెక్కింది. దీని మాటలు దీనివేగం గానీ.. మన మాటంటే లెక్కే లేదేమిటండీ!" అంటోంది చిరాకుగా రాధిక... "ఆగు రాధికా..! మనం ఇచ్చిన మాట మనమే తప్పితే ఆమెకు మనం చెప్పిన మాట మీద విశ్వాసం ఉండదు. ఇక తను ఇచ్చిన మాట మీద తాను ఎప్పటికీ నిలబడదు." అని సింధూ వైపు తిరిగి... "ఓకే నాన్నా ! నీ కోరిక తీరుస్తాను." రాధిక ఎంత బ్రతిమాలినా సింధూ తన నిర్ణయం మార్చుకోలేదు. ఆదివారం సింధూని సెలూన్ కి తీసుకువెళ్ళి గుండు చేయించి తీసుకువచ్చాడు ప్రదీప్. గుండ్రటి మొహం. గుండ్రటి బొట్టు, పెద్ద కళ్ళు చాలా అందంగా కనబడుతోంది. స్కూల్ కి తీసుకువెళ్ళడం ఎలా ? సోమవారం.... స్కూల్ కి తీసుకువెళ్ళాడు ప్రదీప్. గుండుతో ఉన్న సింధు క్లాస్ లోకి వెడుతూ ఉంది. లోపలికి వెడుతున్న సింధూ వెనక్కి తిరిగి చేయి ఊపుతోంది. ప్రదీప్ కూడా చేయి ఊపుతున్నాడు. అప్పుడే వచ్చిన మరో కార్ లో నుండి ఒక అబ్బాయి దిగుతూ "సింధూ ! సింధూ ! ఆగు ఆగు" అంటున్నాడు. అటువేపు తిరిగాడు ప్రదీప్.ఆ పిల్లాడు కూడా గుండుతో ఉన్నాడు. ప్రదీప్ కి అర్థం అయ్యింది "ఇదా కారణం!" కారులోనుండి ఒకామె దిగింది. ప్రదీప్ ని సమీపించి.. "సార్! మీ అమ్మాయి సింధూజ గొప్ప వ్యక్తిత్వం ఉన్న పిల్లండీ ! మీ పిల్లతో పాటు నడుస్తున్న ఆ పిల్లాడు మా అబ్బాయే. వాడికి 'లుకేమియా'..." అంటూ ఆమె కన్నీళ్లను అదిమి పెట్టుకుంటోంది. పెదాలు వణుకుతున్నాయి. "ఆ జబ్బుకి ట్రీట్మెంట్ చేయిస్తున్నాము. దానివలన వాడికి వెంట్రుకలన్నీ రాలిపోయాయి. అందుకని గుండుతో స్కూల్ కి వెళ్ళను అని ఇంట్లోనే ఉండిపోయాడు. మీ సింధూజ కిందటి వారం మాయింటికి వచ్చి, బిమీ పిల్లాడు స్కూల్ కి ఎందుకు రావడం లేదు?" అంటూ అడిగింది. వాడు స్కూల్ కి వచ్చి తీరాలని వాడితో పట్టుపట్టింది. ఎవరూ తనని చూసి నవ్వకుండా చేస్తాను.. అని వాడిని ఒప్పించింది. తన చేతిలో వాడి చెయ్యి వేయించుకుని ఒప్పించింది. మా వాడు ఈ రోజు నుంచి స్కూల్ కి వెళ్తాను అన్నాడు. అందుకే ఈ రోజు తీసుకు వచ్చాను. కానీ, వాడు స్కూల్ కి రావడం కోసం తన అందమైన జుట్టును ఇలా త్యాగం చేస్తుందని కలలో కూడా ఊహించలేదు సార్! మీ పెంపకం చాలా గొప్పది సార్! మీరూ, మీ భార్యా ఆమెను చాలా గొప్ప వ్యక్తిగా తీర్చిదిద్దారండీ!" ప్రదీప్ కళ్ళల్లో నీళ్ళు జలపాతంలా కారిపోతున్నాయి. ప్రదీప్ మనసులో అనుకుంటున్నాడు. "సింధూ..! ఇప్పుడు నువ్వు నాకు నేర్పావమ్మా..! 'నిస్వార్థ ప్రేమ' అంటే ఏమిటో...?" ఈ ప్రపంచంలో మనం సాధించవలసినది కేవలం మన కోసం మనం జీవించడమే కాదు. "ఇతరుల కోసం జీవించడం" మనకున్న ఈ చిన్నపాటి జీవితంలో ఇలాంటి చిన్నచిన్న మంచి పనులు ఎదుటివారికి ఎంతో కొంత మేలు చేయడమే కాకుండా మన మనసుకు కూడా ఎంతో ఆత్మ సంతృప్తిని కలిగిస్తాయి. ఏమంటారు నిజమేకదా..!


## రైతన్నా- మీకోసం...వ్యవసాయ అనుబంధ రంగాల అధికారులు పాల్గొనాలి : కలెక్టర్ సుమిత్ కుమార్



**చిత్తూరు, నవంబర్ 22 :** ఈ నెల 24 నుంచి 29 తేదీ వరకూ అలాగే డిసెంబరు 3 తేదీన నిర్వహించనున్న రైతన్నా – మీ కోసం కార్యక్రమంలో వ్యవసాయ అనుబంధ రంగా అధికారులు ప్రతి ఒక్కరు పాల్గొనాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ పేర్కొన్నారు. శనివారం సాయంత్రం సమయంలో క్యాంప్ కార్యాలయం నుండి టెలి కాన్ఫరెన్స్ ద్వారా సంబంధిత అధికారులకు దిశా దిశ నిర్దేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరు కావాలని స్పష్టం చేశారు. ఆర్ ఎస్ కే పరిధిలోని ప్రతీ రైతు ఇంటికీ ముఖ్యమంత్రి లేఖను అందించటంతో పాటు నిర్దేశించిన పంచ సూత్రాలను కూడా వివరించి చెప్పాలని పేర్కొన్నారు. వ్యవసాయం, ఉద్యాన, ఆక్వా కల్చర్ లో అత్యుత్తమ సాగు విధానాలు పాటించేలా చైతన్యం కలిగించాలని నిర్దేశించారు. నీటి భద్రత లో భాగంగా భూగర్భజలాలు, రిజర్వాయర్లు, చెరువుల్లోని నీటి నిల్వల వివరాలతో పాటు సమర్థ నీటి నిర్వహణ వల్ల కలిగే లాభాలను రైతులకు వివరించాలన్నారు. డిమాండ్ డ్రివెన్ అగ్రికల్చర్ లో భాగంగా వాణిజ్య, అంతర ప్రత్యామ్నాయ పంటలు, ప్రకృతి సేద్యం గురించి చెప్పాలన్నారు. అగ్రిటెక్ లో భాగంగా వ్యవసాయ యాంత్రీకరణ, డ్రోన్ వినియోగం, శాటిలైట్ టెక్నాలజీ లాంటి అంశాలు ఉండాలని సూచించారు. మద్దతు ధరలు, పీఎం కిసాన్, ఇన్ పుట్ సబ్సీడీ, రైతు బజార్లు మార్కెటింగ్ వివరాలు ఇవ్వాలన్నారు. వ్యవసాయ శాఖ తయారు చేసిన ఫార్మర్ యాప్ ను ప్రతీ రైతుకూ చేరువ చేయాలని సూచించారు. యాప్ ద్వారా వ్యవసాయ భూమి, పంట సాగు వివరాలు, వాతావరణ సలహాలు, తెగుళ్లకు సంబంధించిన హెచ్చరికలు, మార్కెట్ ధరలు, భూసార పరీక్షలు, మార్కెట్ ఇంటెలిజెన్స్ లాంటి వివరాలను అందించాలన్నారు. రియల్ టైమ్ లో సమాచారం అందితేనే రైతులకు ప్రయోజనం ఉంటుందని అన్నారు. క్షేత్రస్థాయిలో అగ్రికల్చర్, హార్టికల్చర్, సెరికల్చర్, అక్వా కల్చర్ అసిస్టెంట్లు రైతన్నా- మీకోసం కార్యక్రమాన్ని రైతుల వద్దకు తీసుకెళ్లటంలో వారంతా ముఖ్యపాత్ర పోషించాలని అన్నారు.

## ఎవరైనా అనారోగ్యం నుండి కోలుకోవాలంటే, కొంత శాతం మందులు సహాయపడతాయి, అవి కాకుండా మిగిలిన వాటి సంగతి ఏమిటి?

– సివి భాస్కర్ రెడ్డి


**కన్హ పెన్ పవర్ నవంబర్ 22 :** సానుకూల దృక్పథం ఈ సంఘటన లండన్ లోని ఓ ఆసుపత్రిలో చోటుచేసుకుంది. రోగికి ఆపరేషన్ చేయడానికి రెండు గంటల ముందు, ఒక నర్సు అతని గదిలోకి ప్రవేశించి, అక్కడ ఉంచిన పూల గుత్తిని అలంకరించడం, సరిచేయడం ప్రారంభించింది. చాలా అంకితభావంతో పని చేస్తున్న ఆమె అకస్మాత్తుగా రోగిని "సార్, మీ ఆపరేషన్ ఏ డాక్టర్ చేస్తున్నారు?",అని అడిగింది. నర్సు వైపు చూడకుండా, ఆ రోగి "డాక్టర్ జాబ్సన్!", అని చెప్పాడు. నర్సు డాక్టర్ పేరు విని, చేస్తున్న పని ఆపేసి దగ్గరకు వచ్చి, ఆశ్చర్యంతో, "సార్, డాక్టర్ జాబ్సన్ మీకు ఆపరేషన్ చేయడానికి నిజంగా అంగీకరించారా?", అని అడిగాడు. రోగి,"అవును, ఆయనే నా ఆపరేషన్ చేస్తాడు", అన్నాడు. నర్సు, "చాలా ఆశ్చర్యంగా ఉందే, నేను నమ్మలేకపోతున్నాను!" అంది. కంగారుపడుతూ రోగి ఇలా అడిగాడు, "అందులో అంత ఆశ్చర్యపోయే విషయం ఏముంది?" నర్సు ఇలా చెప్పింది, " ఆయన ఇప్పటివరకు వేల సంఖ్యలో ఆపరేషన్లు చేసారు, 100 శాతం ఫలితాలు కూడా సాధించారు. చాలా బిజీగా ఉంటారు, ఆయన సమయం దొరకడం కూడా చాలా కష్టం. మీ ఆపరేషన్ కి సమయం ఎలా కేటాయించారా అని నేను ఆశ్చర్యపోతున్నాను. మీరు చాలా అదృష్టవంతులు." నర్సు చెప్పిన మాటలు వినగానే పేషెంట్ మొహంలో తృప్తి, సంతోషం వెల్లివిరిసింది. అతను నర్సుతో, "డాక్టర్ జాబ్సన్ నాకు కొంత సమయం కేటాయించి, నాకు ఆపరేషన్ చేయడం నిజంగా నా అదృష్టం", అన్నాడు. నర్స్ మరోసారి చెప్పింది, "నన్ను నమ్మండి, ఈ ప్రపంచంలోని అత్యుత్తమ వైద్యుడు మీకు ఆపరేషన్ చేయడం నాకు ఇంకా ఆశ్చర్యంగానే ఉంది!" ఈ సంభాషణ తర్వాత, రోగిని ఆపరేషన్ థియేటర్ కు తీసుకెళ్లారు. ఆపరేషన్ విజయవంతంగా జరిగింది. ప్రస్తుతం అతను సంతోషంగా జీవిస్తున్నాడు. ఆ పేషెంట్ గదికి వచ్చిన మహిళ మామూలు నర్సు కాదు, అదే ఆసుపత్రికి చెందిన మహిళా మానసిక వైద్యనిపుణురాలు, రోగికి అనుమానం కూడా రాని విధంగా రోగులను మానసికంగా తయారుచేయడమే పనిగా పెట్టుకుంది. ఏమాత్రం అనుమానం లేకుండా రోగికి భయం కూడా తొలగిపోతుంది. ఈసారి, రోగి గదిలో పుష్పగుచ్ఛాన్ని అలంకరిస్తూ, ఆ డాక్టర్ తన పని చేసింది. ఆపరేషన్ చేసే వైద్యుడు ప్రపంచ ప్రసిద్ధి చెందినవాడని, అత్యంత విజయవంతమైన వైద్యుడని, ప్రతీ ఆపరేషన్ విజయవంతంగా చేస్తారని చాలా అందంగా రోగి హృదయానికి, మనస్సుకు భరోసా ఇచ్చింది. వీటన్నింటితో, రోగి స్వయంగా తానే ఒక సానుకూల మార్గంలో ఆరోగ్యాన్ని మెరుగుపరుచుకునే దిశగా సాగాడు. దృఢమైన సంకల్పంతో వ్యాధులని అదుపు చేయవచ్చన్న విశ్వాసం ఎంత బలంగా ఉందో, రోగి వ్యాధిని అధిగమించవచ్చని అంతే దృఢంగా ఈ రోజు సైన్స్ రుజువు చేస్తోంది. ఒక వ్యక్తి ఆందోళనలో, భయంలో జీవిస్తున్నప్పుడు, విషయాల గురించి భ్రమలు సృష్టించుకోవడం ప్రారంభిస్తాడు. సంయమన స్థితికి చేరుకోవడానికి యోగా మనకు సహాయపడుతుంది. సంయమనమైన, నిష్పాక్షిక హృదయంతో, సంయమనమైన, నిష్పాక్షిక మనస్తత్వంతో, ఒక వ్యక్తి ఏది సరైనది – ఏది తప్పు, ఏది ప్రయోజనకరమైనది – ఏది కాదు అనే దాని మధ్య వ్యత్యాసాన్ని అర్థం చేసుకుంటాడు. హార్ట్ ఫుల్ నెస్ లాంటి ఒక సాధారణ సాధన కోట్లాది మంది విధిని ఎలా మార్చగలదు? మన జీవితాలలో మార్పును తీసుకురావడానికి మన ఆలోచనల శక్తి, అన్నిటిని గెలవగలిగే మన హృదయాలలో ప్రేమ యొక్క శక్తి – ఇలా మానవ హృదయం, మానవ మనస్సు యొక్క అపారమైన సంభావ్యత కారణంగా, ఇవి మన విధిని మార్చడంలో ముఖ్యమైన పాత్ర పోషిస్తాయి.

**దాజీ**

**హార్ట్ ఫుల్ నెస్ ధ్యానం ?**

## లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ విధుల పై రివ్యూ మీటింగ్



**కడప పెన్ పవర్ నవంబర్ 22 :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయ సేవ అధికార సంస్థ అమరావతి వారి ఆదేశానుసారంగా గౌరవ డాక్టర్ సి.యామిని, చైర్మన్–కం–జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, కడప వారు మరియు గౌరవ శ్రీ ఎస్.బాబా ఫక్రుద్దీన్, సెక్రటరీ–కం–సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, కడప వారు గౌరవ జిల్లా ప్రధాన న్యాయమూర్తి వారి చాంబర్ నందు "లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ విధులు పై రివ్యూ మీటింగ్" నిర్వహించడం జరిగినది. ఈ సందర్భంగా మాట్లాడుతూ "లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ విధులు, చట్టపరమైన సలహాలు, జైలు విజిట్లు, కేసుల వివరాలు మరియు పరిష్కారము మొదలగు అంశాలను చర్చించారు, తగు సూచనలు ఇవ్వడం జరిగినది. ఈ కార్యక్రమంలో చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ ఎన్.హరిబాబు, డిప్యూటీ చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ లు శ్రీమతి ఎమ్.శాంత, ఎం.వినయ్ కుమార్, శ్రీమతి ఎం.చంద్రకాంతమ్మ, అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సెల్లు పి.మనోహర్, శ్రీమతి ఎం.సౌజన్య, ఎన్.నీలకంఠేశ్వర రెడ్డి, షేక్ అక్బర్ అలీ, ఎస్.రవితేజ, ప్రవీణ్ కుమార్ పాల్గొన్నారు పాల్గొన్నారు.

## "హిట్ అండ్ రన్ కేసులలో పరిహారము చెల్లింపు మొదలగు అంశాలపై డిస్టిక్ లెవెల్ అధికారుల మానిటరింగ్ మీటింగ్"



**కడప పెన్ పవర్ నవంబర్ 22 :** డాక్టర్ సి.యామిని, చైర్మన్ కం జిల్లా ప్రధాన న్యాయమూర్తి జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కడప వారి సూచనల మేరకు గౌరవ సెక్రటరీ–కం–సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, కడప శ్రీ ఎస్.బాబా ఫక్రుద్దీన్ వారు కడప కోర్టు కాంపౌండ్ లో గల న్యాయ సేవా సదన్ నందు "హిట్ అండ్ రన్ కేసుల లో పరిహారము చెల్లింపు మొదలగు అంశాలపై డిస్టిక్ లెవెల్ అధికారుల మానిటరింగ్ మీటింగ్" వర్చువల్ పద్ధతిలో నిర్వహించడం జరిగినది. ఈ సందర్భంగా మాట్లాడుతూ పెట్టండని కేసుల వివరాలు మరియు కాంపెన్సేషన్ మొదల అంశాలపై చర్చించడం జరిగినది, తగు సూచనలు ఇవ్వడం జరిగినది. ఈ కార్యక్రమంలో కడప మరియు రాయచోటి సబ్ డివిజనల్ పోలీస్ అధికారులు, కడప మరియు రాయచోటి రెవెన్యూ డివిజనల్ అధికారులు పాల్గొన్నారు.

## దివ్యాంగుల సంక్షేమానికి అధిక ప్రాధాన్యం : కలెక్టర్ సుమిత్ కుమార్



**చిత్తూరు,పెన్ పవర్ నవంబరు 21 :** దివ్యాంగుల సంక్షేమానికి అధిక ప్రాధాన్యతను ప్రభుత్వం ఇస్తున్నదని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ పేర్కొన్నారు. శుక్రవారం ఐరాల మండలం లోని అగ్ర గ్రామం జడ్పీ హైస్కూల్ క్రీడా మైదానంలో సామాజిక న్యాయం సాధికారత మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో దివ్యాంగులు, వృద్ధులు సహాయ పరికరాల గుర్తింపు కార్యక్రమానికిజిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ పూతలపట్టు నియోజక వర్గం శాసనసభ్యులు మురళీమోహన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ 20 నుండి 25 రకాల దివ్యాంగులకు, వృద్ధులకు చెవి సమస్య ఉంటే హీరింగ్ ఎయిడ్స్ ఇవ్వడం లేకపోతే ఒక డివైస్ ఇవ్వడం, ఒక వీల్ చైర్ ఇవ్వడం, ఒక స్టిక్ ఇవ్వడం కూడా జిల్లాలో చేయడం, జరుగుతూ ఉందని తెలిపారు . సుమారుగా 3600 మంది లబ్ధి పొందడం జరిగిందన్నారు.

# ఉచిత కళ్లద్దాల పంపిణీ శుభారంభం

ప్రజా సేవకు అంకితభావం అవసరం: ఎమ్మెల్యే వంశీకృష్ణ





**విశాఖ దక్షిణం, పెన్ పవర్, నవంబర్ 22 :** 32వ వార్డులో కేఎన్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత కళ్లద్దాల పంపిణీ కార్యక్ర మం ఘనంగా జరిగింది. ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ కందులు నాగరాజు నేతృత్వంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో స్థానిక శాసనసభ్యులు, జన సేన పార్టీ విశాఖపట్నం నగర అధ్యక్షులు వంశీ కృష్ణ శ్రీనివాస్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ పలువురికి తమ చేతుల మీదుగా ఉచిత కళ్లద్దాలు అందజేశారు. అనంతరం మాట్లాడిన ఆయన, ప్రజా సేవను ధ్యేయంగా తీసుకుని నిరంతరం సేవా కార్యక్ర మాలు నిర్వహిస్తున్న నాగరాజు సేవాభావం అభినందనీయం. ఇటువంటి మరిన్ని కార్యక్ర మాలు చేపట్టి మరింత ఉన్నత స్థానం చేరుకోవాలి అన్నారు.
ఈ కార్యక్రమంలో స్టేట్ డైరెక్టర్ తెలుగు లక్ష్మీ, టిడిపి,బీజేపీ జనసేన నాయకులు, వార్డు ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# అంగన్వాడీ కేంద్రంలో ఘనంగా స్వచ్ఛంద్రా -స్వర్ణాంధ్ర కార్యక్రమం





**విశాఖ పశ్చిమ, పెన్ పవర్, నవంబర్ 22 :** జీవీఎంసీ 89వ వార్డు, సచివాలయం పరిధిలోని ఎల్లపువాని పాలెం అంగన్వాడీ కేంద్రంలో శాస ప్రోగ్రామ్‌లో భాగంగా స్వచ్ఛంద్రా–స్వర్ణాంధ్ర కార్యక్రమం శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి 89వ వార్డు కార్పొరేటర్, స్టాండింగ్ కమిటీ మెంబర్ దాడి వెంకట రమేష్, జోనల్ కమిషనర్ శంకరరావు, ఎస్ఎస్–8 అధికారి కె.వి. రమణ, వార్డు శానిటరీ ఇన్స్పెక్టర్ రామకృష్ణ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.
ఈ కార్యక్రమంలో మహిళలకు పోషణ, ఆరోగ్య పరిరక్షణ, శిశు సంరక్షణపై అధికారులు విస్తృతంగా అవగాహన కల్పించారు. మహిళల ఆరోగ్యం అత్యంత ముఖ్యమని కార్పొరేటర్ వెంకట రమేష్ అన్నారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ వెంకట రమేష్ మాట్లాడుతూ గర్భిణీ స్త్రీలు, ఆరు నెలల బిడ్డలకు తల్లులు తీసుకోవాల్సిన ఆహారపు శైలిపై మహిళలకు విలువైన సూచనలు అందించారు. గర్భిణీలు నిరంతరం పౌష్టికాహారం తీసుకోవడం తప్పనిసరని తెలిపారు. తల్లి ఆరోగ్యం బాగుంటేనే శిశువు ఆరోగ్యంగా జన్మిస్తాడని గుర్తుచేశారు.
డాక్టర్లు, ఏఎన్ఎంలు సూచించిన విధానాలను ఖచ్చితంగా పాటించాలని మహిళలకు విజ్ఞప్తి చేశారు. అలాగే ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అందిస్తున్న గుడ్లు, పాలు, చక్కెలు, రాగి (తింటూ), పోషకాహార ప్యాక్స్ వంటి వస్తువులను సమయానికి సక్రమంగా తీసుకుంటూ ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని సూచించారు. గర్భిణీలకు అవసరమైన పోషక విలువల గురించి వివరించారు. శుభ్రత, శానిటేషన్, ఆరోగ్య పరీక్షల ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. చిన్నారుల పోషణ, అంగన్వాడీ సేవల వినియోగంపై సూచనలు అందించారు. మహిళలు మంచి సంఖ్యలో పాల్గొని సందేహాలను నివృత్తి చేసుకున్నారు. ఈ స్వచ్ఛంద్రా%–%స్వర్ణాంధ్ర కార్యక్రమం ద్వారా గర్భిణీ స్త్రీలు, శిశువుల తల్లుల్లో ఆరోగ్య చైతన్యం పెంపొందించడమే లక్ష్యమని అధికారులు తెలిపారు. కార్యక్రమం విజయవంతంగా ముగిసింది.

# జీవీఎంసీ హెల్త్ అసిస్టెంట్ పోస్టుల భర్తీపై ఉద్యోగుల ఆందోళనలు!





### 12 ఏళ్లుగా ప్రమోషన్లు లేక నిలిచిపోయిన కెరీర్ ప్రగతి

**విశాఖపట్నం, పెన్ పవర్, నవంబర్ 22 :** గ్రేటర్ విశాఖ మున్సిపల్ కార్పొరేషన్ (జీవీఎంసీ) లో హెల్త్ విభాగంలో ప్రమోషన్ల సమస్య మరింత ముదిరింది. సానిటరీ ఇన్స్పెక్టర్‌గా ఎదగాలంటే ముందుగా హెల్త్ అసిస్టెంట్‌గా ప్రమోషన్ తప్పనిసరి. అయితే గత 12 సంవత్సరాలుగా ఈ పోస్టులను భర్తీ చేయకపోవడంతో క్లాస్–%×××%, క్లాస్–%×ఒ% ఉద్యోగుల కెరీర్ వృద్ధి పూర్తిగా నిలిచిపోయిన పరిస్థితి నెలకొంది.
జీవీఎంసీ పరిధిలో మొత్తం 42 హెల్త్ అసిస్టెంట్ పోస్టులు ఖాళీగా ఉన్నా, 2013 నుంచి ఇప్పటివరకు ఒక్క నియామకం లేదా ప్రమోషన్ కూడా జరగలేదు. దీనివల్ల సుదీర్ఘకాలంగా విధులు నిర్వర్తిస్తున్న ఉద్యోగులు తమ సేవా కాలం ఆధారంగా పొందాల్సిన సీనియారిటీ గుర్తింపు, ప్రమోషన్లు, సేవా లాభాలు కోల్పోతున్నారని తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

**ఉద్యోగుల ఆరోపణ ప్రకారం..**

గత కొంత కాలంగా ఔట్సోర్సింగ్ స్టాఫ్, ఎంటిఎస్ ఉద్యోగులు, సానిటరీ సెక్రటరీలు వంటి తాత్కాలిక సిబ్బందికి హెల్త్ అసిస్టెంట్ ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించడం వల్లే రెగ్యులర్ పోస్టులు ఖాళీగా ఉంచుతున్నట్లు తెలుస్తోంది. ఈ విధానంతో పర్మనెంట్ ఉద్యోగుల హక్కులు నష్టపోతున్నాయి, సర్వీస్ ఇంక్రిమెంట్లు, ప్రమోషన్ అవకాశాలు, రిటైర్మెంట్ సమయంలో లభించే పెన్షన్, గ్రాచ్యుటీపై ప్రతికూల ప్రభావం పడుతుందన్న ఆందోళన ఉద్యోగుల్లో నెలకొంది.

**ఉద్యోగులు చెబుతున్నదేమంటే..**

గత 12 సంవత్సరాలుగా హెల్త్ అసిస్టెంట్ పోస్టులు తీసుకోకపోవడంతో మేము చేసిన సేవకు గుర్తింపు లేకుండా పోతోంది. భవిష్యత్ కెరీర్, శాలరీ పెరుగుదల, పెన్షన్ ప్రయోజనాలకు ఈ నిలదీత తీవ్ర నష్టం కలిగిస్తుంది" అని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇంతకుముందు నగర మేయర్ పీలా శ్రీనివాసరావు బాధ్యతలు చేపట్టిన తర్వాత బిల్ కలెక్టర్లు, సీనియర్ అసిస్టెంట్లు, సూపరింటెండెంట్లు వంటి విభాగాలకు స్టాండింగ్ కమిటీ ప్రతిపాదనలు ఆమోదించి ప్రమోషన్లు ఇచ్చిన విషయం తెలిసిందే. కానీ హెల్త్ అసిస్టెంట్ పోస్టుల విషయంలో మాత్రం ఎటువంటి నిర్ణయం తీసుకోకపోవడం ఉద్యోగుల్లో తీవ్ర అసంతృప్తికి కారణమైంది.
ఉద్యోగులు ఇప్పుడు గ్రేటర్ కమిషనర్‌ని నేరుగా కోరుతున్నారు. "హెల్త్ అసిస్టెంట్ పోస్టులను వెంటనే భర్తీ చేసి, పబ్లిక్ హెల్త్ వ్యవస్థను బలోపేతం చేయాలి. పదేళ్లుగా పెండింగ్‌లో ఉన్న ప్రమోషన్లను వెంటనే ఇవ్వాలి. పబ్లిక్ హెల్త్‌కు అత్యంత కీలకమైన ఈ పోస్టులు ఖాళీగా ఉండడంతో వ్యర్థాల నిర్వహణ, డెంగ్యూ%–%మలేరియా నియంత్రణ, ఫీల్డ్ హెల్త్ సర్వేలలోనూ ప్రతికూల ప్రభావం పడుతున్నట్లు అధికారులు కూడా అంగీకరిస్తున్నారు. ఇప్పటి వరకు నిలిచిపోయిన ఈ నియామకాలపై జీవీఎంసీ ఏ నిర్ణయం తీసుకుంటుందో ఉద్యోగులు, ప్రజా ప్రతినిధులు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు

# అనకాపల్లి జిల్లా పోలీసు కుటుంబాల సంక్షేమంపై కీలక నిర్ణయాలు

## విధినిర్వహణలో ప్రాణాలు అర్పించిన కుటుంబాలను ఆదుకుంటున్న పోలీసులు





**అనకాపల్లి, పెన్ పవర్, నవంబర్ 22:**
విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన పోలీసు సిబ్బంది కుటుంబాలకు అందాల్సిన అన్ని రకాల ప్రభుత్వ మరియు విభాగీయ ఆర్థిక ప్రయోజనాలు వేగంగా చేరేందుకు అనకాపల్లి జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా ఆధ్వర్యంలో ప్రత్యేక సమీక్ష సమావేశం నిర్వహించారు. ఉమ్మడి అనకాపల్లి%–%అల్లూరి సీతారామరాజు జిల్లాలకు చెందిన డిసీజ్డ్ పోలీస్ సిబ్బంది కుటుంబాల కేసుల పురోగతిపై ఆయన సమగ్రంగా సమీక్షించారు. సమీక్ష సమావేశంలో ఎస్పీ గ్రాట్యుటీ, ఏపీజిఎల్ఐ, పిఎఫ్, జిఐఎస్ కో–ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ ప్రయోజనాలు, డెత్ బెనిఫిట్స్, ప్రభుత్వం అందించే యాక్సిడెంటల్ ఇన్సూరెన్స్ వంటి మొత్తం ఆర్థిక లబ్ధులు సకాలంలో బాధిత కుటుంబాలకు చేరేలా చర్యలు వేగవంతం చేయాలని అధికారులకు ఆదేశించారు. ఇప్పటికే పూర్తయిన ఫైళ్లను, ఇంకా పెండింగ్‌లో ఉన్న కేసులను పోల్చి, పెండింగ్ కేసులను తక్షణమే పరిష్కరించేందుకు స్పష్టమైన సూచనలు ఇచ్చారు.

**కారుణ్య నియామకాలపై దృష్టిసారించిన ఎస్పీ..**

విధి నిర్వహణలో మరణించిన సిబ్బంది కుటుంబాలకు కారుణ్య నియామకాలు అత్యంత ముఖ్యమని పేర్కొన్న ఎస్పీ తుహిన్ సిన్హా, పెండింగ్ కేసులను శీఘ్రం పరిష్కరించి బాధిత కుటుంబాలకు న్యాయం చేకూరేలా చూడాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. విధిలో గాయపడిన లేదా ప్రమాదాల్లో మరణించిన సిబ్బంది కుటుంబాలకు సంబంధించిన పిల్లల విద్య, ఉద్యోగ అవకాశాలు, అందాల్సిన బెనిఫిట్లు వంటి అంశాలపై వివరాలను సేకరించి తక్షణ సలహాలు, చర్యలు చేపట్టాలని ఎస్పీ సూచించారు. సమీక్ష అనంతరం అనకాపల్లి జిల్లా పోలీస్ ఆధ్వర్యంలో విధి నిర్వహణలో మరణించిన ఆరుగురు పోలీస్ సిబ్బంది కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.50వేలు చొప్పున చెక్కులను ఎస్పీ తుహిన్ సిన్హా స్వయంగా అందజేశారు. హెచ్.సీ కె.దీనబంధు భార్య ఆర్.రాధా, పీసీ సిహెచ్.విజయ రామసింగ్, భార్య ఆర్.సుధారాణి, హెచ్.సీ వి.అప్పలరాజు, భార్య వి.లక్ష్మీకాంతం, హెచ్.సీ సిహెచ్.సాంబమూర్తి, భార్య సిహెచ్.గడ్డమ్మ, ఏఆర్ఎస్ఐ పి.రమణ, భార్య పి.వి.కుమారి, ఏఆర్ హెచ్.సీ వి.ఈశ్వరరావు %–% భార్య వి.పద్మ వీరికి పోలీసు శాఖ తమ సిబ్బందికి ఎల్లప్పుడూ అండగా ఉంటుందని ఎస్పీ తెలిపారు. చెక్కుల పంపిణీ అనంతరం ఎస్పీ మాట్లాడుతూ పోలీసు శాఖ కోసం తమ జీవితాలను అర్పించిన సిబ్బందికి మేము ఎప్పటికీ రుణపడి ఉంటాము. వారి కుటుంబాలను ఆదుకోవడం మా ప్రథమ బాధ్యత. ఈ సహాయం, ఈ పరిరక్షణ భవిష్యత్తులో కూడా నిరంతరంగా కొనసాగుతుందని తెలిపారు. సమావేశం మరియు కార్యక్రమంలో అదనపు ఎస్పీలు ఎం.దేవ ప్రసాద్, ఎల్.మోహనరావు, ఏవో సి.హెచ్.తిలక్ బాబు, ఇన్స్పెక్టర్లు ఎస్.అప్పలనాయుడు, బి.రామకృష్ణారావు, పోలీస్ అడహక్ కమిటీ సభ్యులు, సూపర్డెంట్లు ప్రతాప శేషయ్య, దేవరాజు, అలాగే కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.



# ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యములో ఉచిత క్యాన్సర్ పరీక్ష శిబిరం



**జ్ఞానపురం, పెన్ పవర్ నవంబర్ 22:** ఎన్ఎస్ఎస్ ప్రత్యేక శిబిర కార్యక్రమం భాగంగా సెయింట్ జోసెఫ్ కళాశాల (ఆటోనమస్), విశాఖపట్నం ఆధ్వర్యంలో శనివారం ఉచిత క్యాన్సర్ పరీక్ష శిబిరం నిర్వహించబడింది. ఈ శిబిరం మెడికోవర్ క్యాన్సర్ హాస్పిటల్ సహకారంతో ప్రజలలో క్యాన్సర్ గురించి అవగాహన కల్పించడం, ముందస్తు గుర్తింపును ప్రోత్సహించడం లక్ష్యంగా ఏర్పాటుచేశారు. ఈ శిబిరం కార్పొరేటర్ శ్రీమతి కొడిగుడ్ల పూర్ణిమ %ఒ% శ్రీధర్ గారి కార్యాలయం సహాయంతో జోన్ – 5లోని జీవీఎంసీ జోనల్ కార్యాలయం సమీపంలోని 41 వార్డులో ఈ ప్రత్యేక శిబిర కార్యక్రమాన్ని నిర్వహించబడింది. స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని వైద్య సేవలను పొందారు. మెడికోవర్ ఆసుపత్రి నిపుణులు, వైద్య సిబ్బంది పర్యవేక్షణలో వివిధ రకాల క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు చేపట్టారు. ఈ కార్యక్రమాన్ని ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ కె. మాణిక్య కుమారి నాయకత్వంలో ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు విజయవంతంగా నిర్వహించారు. వాలంటీర్లు ప్రజలను చైతన్యపరచడం, వైద్య బృందానికి సహకరించడం వంటి పనులు చేశారు. డాక్టర్ ఆర్. లావణ్య అసిస్టెంట్ ఆంకాలజిస్ట్ శిబిరానికి హాజరై గర్భాశయ క్యాన్సర్‌తో బాధపడుతున్న రోగులకు సిపిఎపి–స్మియర్ పరీక్ష నిర్వహించారు. బ్రెస్ట్ క్యాన్సర్ రోగులను మామోగ్రఫీ ద్వారా కూడా పరీక్షించి అవసరమైన కౌన్సెలింగ్ మరియు తదుపరి మందులను అందిస్తారు. ఇతర వ్యాధులతో బాధపడుతున్న కొంతమంది పురుషులతో సహా దాదాపు 80 మందిని పరీక్షించారు. మెడికోవర్ ఆసుపత్రి ఈ శిబిరం ద్వారా రోగులకు 50% తగ్గింపు మరియు కొంతమంది పేద రోగులకు ఉచిత చికిత్సను అందిస్తోంది. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సిస్టర్ షైజి మరియు కళాశాల యాజమాన్యం ఎన్ఎస్ఎస్ యూనిట్‌ను అభినందిస్తూ ఇటువంటి ఆరోగ్య కార్యక్రమాలు ప్రజలకు ఎంతో మేలు చేస్తాయని, ముందస్తు గుర్తింపు ప్రాణాలను రక్షిస్తుందని తెలియజేశారు. ఈ ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ శిబిరం ద్వారా అనేక మంది ప్రజలు సమయానుసారంగా వైద్య సలహాలు, అవగాహన మరియు తదుపరి చికిత్సకు మార్గదర్శకత పొందారు.

# పిలిచి పదవి ఇస్తామన్నా వద్దంటున్నారా




బి. ఎన్. రావు ( నగేష్ బూర్తి )సీనియర్ జర్నలిస్ట్ , విజయవాడ,7702262666

తెలుగుదేశం పార్టీలో సీనియర్ నేతగా ఉన్న దేవినేని ఉమామహేశ్వరరావును రాజ్యసభకు పంపడంపై పార్టీలో చర్చ జరుగుతుంది. మరో ఆరు నెలలో రాజ్యసభ స్థానాలు ఆంధ్రప్రదేశ్ లో ఖాళీ అవుతున్నాయి. ఖాళీ అవుతున్న రాజ్యసభ స్థానాలను దక్కించుకుంటే ఆరేళ్ల పాటు పదవికి ధోకా ఉండదు. అనేక మంది సీనియర్ నేతలు రాజ్యసభ రేసులో ఉన్నారు. అయితే దేవినేని ఉమామహేశ్వరరావుకు పెద్ద వయసు మించిపోలేదు. ఆయనను రాజ్యసభ కు పంపే కంటే ఎమ్మెల్సీ ఇవ్వడం మంచిదన్న అభిప్రాయం కూడా ఆయన అనుచరుల నుంచి వ్యక్తమవుతుంది. కానీ పార్టీ అగ్రనాయకత్వం ఆలోచనలు ఎలా ఉన్నాయన్న దానిపై ఇంకా క్లారిటీ మాత్రం రాలేదు రాజ్యసభ స్థానానికి వెళ్లారంటే ఇక ప్రత్యక్ష రాజకీయాలతో పాటు రాష్ట్ర రాజకీయాలకు కూడా దూరమయినట్లే భావించాల్సి ఉంటుంది. ప్రజలతో నేరుగా సంబంధం లేని పోస్టు కావడంతో దానిపై దేవినేని ఉమ లాంటి వ్యక్తులు అంతగా ఆసక్తి చూపరు. దేవినేని ఉమామహేశ్వరరావు రాజకీయమంతా టీడీపీలోనే కొనసాగుతుంది. నాలుగు సార్లు ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. 1999 లో ఆయన నందిగామ నుంచి రాజకీయాల్లోకి అడుగుపెట్టారు. 2004లోనూ ఆయన నందిగామ నుంచి ఎన్నికయ్యారు. తర్వాత నందిగామ నియోజకవర్గం రిజర్వ్‌డ్ కావడంతో పార్టీ అధినాయకత్వం సూచన మేరకు మైలవరానికి షిఫ్ట్ అయ్యారు.

2009, 2014 ఎన్నికల్లో దేవినేని ఉమ మైలవరం నుంచి ఎన్నికయ్యారు. 2019 ఎన్నికల్లో మాత్రం తొలిసారి ఓటమి పాలయ్యారు దేవినేని ఉమ వ్యవహారంలో అధినాయకత్వం ఆలోచన ఎలా ఉందన్నది ఎవరికీ అర్థం కావడం లేదు. ఉమ ఇక్కడుంటే మళ్లీ కృష్ణా జిల్లా రాజకీయాల్లో గ్రూపు తగాదాలు ఎక్కువవుతాయన్న వాదనలను కూడా పార్టీ నాయకత్వం పరిగణనలోకి తీసుకునే అవకాశముంది. అదే సమయంలో దేవినేని ఉమను రాజ్యసభకు పంపాలంటే సామాజికవర్గం కూడా కొంత అడ్డంకి గా మారుతుంది. ఈ నేపథ్యంలో దేవినేని ఉమకు ఎమ్మెల్సీ పదవి ఇచ్చిఇక్కడే కొనసాగిస్తారా? లేక వచ్చే ఎన్నికల్లో నందిగామ జనరల్ నియోజకవర్గం అయితే అక్కడి నుంచి పోటీ చేయవచ్చని సర్ది చెబుతారా? అన్నది ఇంకా తేలలేదు. రాజ్యసభ పదవి మాత్రం తనకు వద్దంటే వద్దని మాత్రం దేవినేని ఉమ చెబుతున్నట్లు తెలిసింది. పదవి ఇస్తామని ఎవరూ చెప్పకపోయినా.. తనకు పిలిచి పదవి రాజ్యసభ ఇస్తామన్నావద్దని చెబుతానని దేవినేని సన్నిహితుల వద్ద వ్యాఖ్యానిస్తున్నారట.

# లోకల్ బాడీస్.. బాయ్ కాట్... వైసీపీ వ్యూహం...




బి. ఎన్. రావు ( నగేష్ బూర్తి )సీనియర్ జర్నలిస్ట్ , విజయవాడ,7702262666

వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ స్థానిక సంస్థల ఎన్నికల్లో నిలబడుతుందా? అసలు నిలబడగలదా? కూటమి దూకుడును తట్టుకోగలదా? ఇప్పుడు పొలిటికల్ సర్కిల్లో ఇదే చర్చ నడుస్తోంది. 2021లో స్థానిక సంస్థల ఎన్నికలు ఎలా జరిగాయో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి స్పష్టంగా తెలుసు. ఒకవైపు వలంటీర్ల ఒత్తిడి, మరోవైపు వ్యవస్థల మద్దతు, కనీసం టిడిపి నేతలకు నామినేషన్ వేసే ఛాన్స్ కూడా ఇవ్వలేదు. జిల్లా పరిషత్తులు ఏకంగా ఏకగ్రీవం అయ్యాయి. ఎంపీటీసీ స్థానాల్లో పోటీ లేకుండా పోయింది. పోలింగ్ బూత్ లకు వెళ్లి మరి ఓట్లు వేసుకున్న చరిత్ర వైయస్సార్ కాంగ్రెస్ పార్టీది. అటువంటి పార్టీ ఇప్పుడు ప్రతిపక్షంలోకి మారింది. అధికారపక్షంగా తాము చేసిన వ్యవహారం తెలియంది కాదు. అందుకే స్థానిక సంస్థల ఎన్నికల్లో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ దాదాపు పాల్గొనక పోవచ్చు.2019లో గెలిచింది వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ. తరువాత అన్ని రకాల ఎన్నికల్లోనూ ఆపార్టీదే హవా. అంతకుముందు 2006, 2013లో స్థానిక సంస్థల ఎన్నికలు జరిగాయి. ప్రత్యర్థులకు అప్పట్లో అవకాశం ఉండేది. 2006లో టిడిపి గణనీయమైన స్థానిక సంస్థలను సొంతం చేసుకుంది. 2013లో సైతం సత్తా చాటింది. కానీ 2021 లో మాత్రం తెలుగుదేశం పార్టీ కనీసం నామినేషన్లు కూడా వేయలేకపోయింది. అంతలా సాగింది వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ హవా. తొలుత సర్పంచ్ ఎన్నికలు జరిగాయి. 80% వరకు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ దక్కించుకుంది. భయపెట్టి మరి పంచాయితీలను కైవసం చేసుకున్న సందర్భం వచ్చింది. అదే దూకుడుతో మున్సిపల్ ఎన్నికల్లో కూడా తన ప్రభావం చూపింది. కనీసం రాజకీయ ప్రత్యర్థులు నామినేషన్లు వేయకుండా చేసింది. నగరాలతో పాటు పట్టణాలు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ వశం అయ్యాయి. చివరకు మండల పరిషత్తులతోపాటు జిల్లా పరిషత్తులు సైతం ఏకపక్షంగా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ సొంతం చేసుకుంది. అయితే ఇంతలా చేసిన వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ 2024 ఎన్నికల్లో అతి దారుణంగా ఓడిపోయింది.అయితే పులివెందుల జడ్పిటిసి ఉప ఎన్నికల్లో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి డిపాజిట్ కూడా దక్కలేదు. దానికి వైసీపీ చెబుతున్న కారణం అధికార పార్టీ అంతులేని అధికార దుర్వినియోగం. మరి అంతకుముందు వైసీపీ హయాంలో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల గురించి ప్రస్తావిస్తే మాత్రం.. అదంతా ప్రజాస్వామ్య యుతంగా జరిగినట్లు చెబుతోంది. నువ్వు నేర్పిన విద్య నీరజాక్ష అన్నట్టు.. కచ్చితంగా అప్పుడు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ స్థానిక సంస్థల ఎన్నికల్లో తప్పు చేసి ఉంటే.. పులివెందుల ఉప ఎన్నికల్లో సైతం టిడిపి కూటమి ప్రభుత్వం తప్పు చేసినట్టే. అధికార పార్టీ తన ప్రభావం చూపినట్టే. దానిని పసిగడితే మాత్రం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కచ్చితంగా స్థానిక సంస్థల ఎన్నికలను బహిష్కరిస్తుంది. చూడాలి మరి ఏం జరుగుతుందో?

# రగులుతున్న అమరావతి

బి. ఎన్. రావు ( నగేష్ బూర్తి )సీనియర్ జర్నలిస్ట్ , విజయవాడ,7702262666



రాజధాని అమరావతి కోసం భూములు ఇచ్చిన రైతులు ఒక కమిటీగా ఏర్పడి ఈ మధ్యనే గుంటూరులో ఒక సమావేశం నిర్వహించారు. వారి మాటల్లో రాజధాని కోసం భూములు ఇచ్చి అధికారులతో మాటలు పడాల్సిన కర్మ పట్టిందే అన్న బాధ ఎక్కువగా కనిపించింది. చంద్రబాబుపై నమ్మకంతో 29 గ్రామాల ప్రజలు భూములు ఇస్తే తమకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంపై ప్రభుత్వం నత్త నడకన పనిచేస్తోంది అనేది వారి ప్రధాన ఆరోపణ. ముఖ్యంగా సిఆర్డిఏ అధికారులు కలవడానికి నానా అగుచాట్లు పడవలసి వస్తుందని అధికారులు ఏమాత్రం విలువ ఇవ్వడం లేదని వారు వాపోతున్నారు. నిజానికి 2019-24 మధ్య కాలంలో అమరావతినిపూర్తిగా పక్కన పెట్టేసిన జగన్ ప్రభుత్వంపై మొట్టమొదట ఉద్యమాలు చేసింది తామే అని దాని ఫలితంగా 2024 ఎన్నికల్లో కూటమి పెద్ద విజయం సాధించింది అనీ అయితే అధికారంలోకి వచ్చిన తర్వాత అధికారులుకారణంగా రైతులు ఇబ్బందులు పడుతున్నారని వారు ఆరోపిస్తున్నారు. అమరావతి రైతులు వినిపిస్తున్న ప్రధాన సమస్యలు ఇవి

1) గ్రామ కంఠం సమస్య-గెజిట్ నోటిఫికేషన్ ఆలస్యం

ప్రధానంగా అమరావతి రైతులు ఎదుర్కొంటున్న సమస్య అసలు రాజధాని బౌండరీస్ ఎక్కడని. ఇంతవరకు అమరావతి గెజిట్ నోటిఫికేషన్ రాకపోవడంతో రాజధాని ఎల్లలపై సందిగ్దత అలాగే కొనసాగుతుంది. అదిగాక గ్రామ కంఠాల సమస్య అలాగే నిలిచిపోయింది. నిజానికి ప్రభుత్వం, అధికారులు దృష్టి పెడితే పది పదిహేను రోజుల్లో ఈ సమస్యను పరిష్కరించవచ్చు. కానీ కూటమి వచ్చి ఏడాదిన్నర గడిచినా ఇప్పటికి సమస్య అలాగేఉంది.

2) మహిళల్ని, చిన్న రైతులని అవమానిస్తున్నారు

%జ=ణూ% అధికారులు మహిళలు, చిన్నకారు రైతులతో మాట్లాడే విధానం అసలు బాలేదని రాజధాని కోసం భూములు ఇచ్చి ఉద్యమాలు చేసిన తమతో వారి వ్యవహార శైలి ఏమాత్రం బాగుండడం లేదనేది వారి ఆరోపణ.

ముఖ్యమంత్రి చంద్రబాబుపై తమకు వ్యతిరేకత లేదని కానీ కింద ఉన్న నాయకులు అధికారులు తమ సమస్యలు పట్టించుకోవడంలేదని విమర్శిస్తున్నారు.

3) భూములు ఇవ్వని పొలాల్లో ఇచ్చిన వారికి ప్లాట్లు

అమరావతికి 29 గ్రామాల ప్రజలు భూములు ఇవ్వగా ఆయా గ్రామాల్లో ఇంకా కొన్ని పొలాల భూ సమీకరణ జరగాల్సి ఉంది. భూములు ఇచ్చిన రైతులకు ఇంకా రిటర్నబుల్ ఫ్లాట్స్ ఇచ్చే విషయంలో పనులు నత్త నడకన సాగుతున్నాయి. అంతేకాకుండా ఇంకా భూములు ఇవ్వని 1250 ఎకరాల్లో రోడ్లు వేయడం కోసం నోటిఫికేషన్ ఇచ్చారు. దానితో అక్కడ రైతులు కూడా ఆందోళన చేస్తున్నారు. ఈ వ్యవహారం అంతా గజిబిజిగాతయారైంది.

4) ఇప్పటికీ అమరావతి రైతులపై కేసులు అలానే ఉన్నాయి అలానే ఉన్నాయి

2019-24 మధ్య కాలంలో జగన్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన మూడు రాజధానుల బిల్లుకు వ్యతిరేకంగా పోరాటం చేసిన అమరావతి రైతుల %జీూజ% నాయకులపై నమోదు చేసిన కేసులు ఇప్పటికే అలాగే ఉన్నాయి. వీలైనంతత్వరగా తొలగించాలని రైతులు ఆందోళన చేస్తున్నారు. కూటమి అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర గడిచిపోయినా ఎన్నికల్లో ఇచ్చిన ఆ హామీ అలాగే ఉండిపోయింది.ప్రభుత్వం వచ్చిన కొత్తలో మున్సిపల్ మంత్రినారాయణ కలిసి అమరావతి జేఏసీ 14 సమస్యలపై వినతి పత్రం ఇచ్చారు. అయితే వాటిలో నెరవేరింది మాత్రం కేవలం ఒక్కటే. అది రైతులు ఇచ్చిన భూములకు ఏడాది పొడవునా ఇచ్చే కౌలు. అలాగే అమరావతిలోఉన్న అసైండ్ భూములకు సంబంధించి ఇచ్చే నష్ట పరిహారంపై ఇప్పట్లో ఏమి తేల్చలేదని స్పష్టత రైతులకు ఇచ్చేసింది ప్రభుత్వం. మిగిలిన 12 సమస్యలపై ప్రభుత్వం గానీ సిఆర్డిఏ అధికారులు కానీ ఏమి తేల్చకుండాఉండడం వల్ల రైతుల నుంచి జేఏసీ నాయకులు పలు విమర్శలు ఎదుర్కోవాల్సి వస్తుందని వారు వాపోతున్నారు. ఈ నెలాఖరున మరోసారి సమావేశమై తమ తదుపరి కార్యాచరణపై నిర్ణయం తీసుకుంటామనిఅమరావతి రైతుల JAC చెబుతోంది.

# విశాఖలో స్థలాల కోసం అన్వేషణ

బి. ఎన్. రావు ( నగేష్ బూర్తి )సీనియర్ జర్నలిస్ట్ , విజయవాడ,7702262666



'స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్' విధానంతో దూసుకుపోతున్న కూటమి ప్రభుత్వం.. విశాఖలో జరిగిన సీఐఐ భాగస్వామ్య సదస్సులో రూ. 13.21 లక్షల కోట్ల పెట్టుబడులను ఆకర్షించింది. ఈ మేరకు వివిధకంపెనీలతో 613 ఎంవోయూలు కుదుర్చుకుంది. అందులో విశాఖ కేంద్రంగా పరిశ్రమలు ఏర్పాటు చేసేందుకు రూ. లక్ష కోట్ల విలువగల 99 ఒప్పందాలు ఉన్నాయి. పెట్టుబడులు పెట్టడానికి ముందుకువచ్చినకంపెనీలు.. పరిశ్రమల ఏర్పాటు చేసేందుకు భూములు సిద్ధం చేసి, విద్యుత్, నీటి సదుపాయాలు కల్పించడానికి ప్రభుత్వం కార్యాచరణ రూపొందిస్తోంది.తమది స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ విధానమంటూదూసుకెళ్తోంది కూటమి ప్రభుత్వం. రాష్ట్రానికి పెట్టుబడులను ఆకర్షించడమే లక్ష్యంగా తీవ్ర ప్రయత్నాలు చేస్తోంది. ఇటీవల విశాఖలో జరిగిన సీఐఐ భాగస్వామ్య సదస్సులో ఆ మేరకు పెట్టుబడులు రాబట్టడంలో విజయంసాధించింది. ఈ సదస్సులో రూ. 13.21 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారు. మొత్తం 613 ఎంవోయూలు కుదుర్చుకున్నట్లు తెలిపారు. ఇందులో విశాఖపట్నం కేంద్రంగా ఏర్పాటు కానున్న సంస్థలకు సంబంధించి 99 ఒప్పందాలు ఉన్నాయి. వీటి ద్వారా రూ. 98,917 కోట్లు పెట్టుబడులు రానున్నాయి. అయితే కేవలం అవగాహన ఒప్పందాలతోనే సరిపెట్టకుండా.. వీలైనంత త్వరగాకార్యరూపం దాల్చేలా చర్యలు ప్రారంభించింది.విశాఖలో ఏర్పాటయ్యే పరిశ్రమలకు సంబంధించి కుదిరిన ఎంవోయూలను అమలు చేసేలా ప్రభుత్వం రంగంలోకి దిగింది. ఈ మేరకు ఇప్పటికే కార్యాచరణ రూపొందించామని కలెక్టర్ హరేంధిర ప్రసాద్ వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్ ఎకనామిక్ డెవలప్‌మెంట్ బోర్డు (ఏపీఈడీబీ) సూచనల మేరకు.. ఆయా పరిశ్రమల ఏర్పాటుకు అవసరమైన భూ కేటాయింపులు, విద్యుత్తు కనెక్షన్, నీటిసదుపాయాల కల్పన, ఇతర మౌలిక వసతుల ఏర్పాటుకు తర్యలు తీసుకుంటామని చెప్పారు. ఈ మేరకు గురువారం జరిగిన మీడియా సమావేశంలో కలెక్టర్ వెల్లడించారు.పరిశ్రమల ఏర్పాటు కోసం 500 నుంచి 600ఎకరాల భూములు ఇప్పటికే సిద్ధంగా ఉన్నాయని కలెక్టర్ తెలిపారు. వీటికి అదనంగా 1200 ఎకరాలను విశాఖపట్నం మెట్రోపాలిటన్ రీజియన్ డెవలప్‌మెంట్ అథారిటీ ( వీఎంఆర్డీఏ) ద్వారా సమీకరించేందుకుప్రణాళిక చేస్తున్నామని వెల్లడించారు. మరోవైపు, విశాఖ సీఐఐ సదస్సులో కుదిరిన ఒప్పందాల్లో.. అధిక శాతం ఐటీ, టూరిజం, డేటా సెంటర్లకు సంబంధించిన పెట్టుబడులు ఉన్నాయని కలెక్టర్ చెప్పారు. ఇందులో 7 ఐటీ సంస్థలకు ఇప్పటికే భూమి పూజ కార్యక్రమాలు పూర్తి అయినట్లు వెల్లడించారు. కాగా, ఈ మొత్తం పెట్టుబడులు పూర్తి స్థాయిలో కార్యరూపం దాల్చితే.. 2,58,089 మందికి ఉద్యోగాలు లభించే అవకాశం కలుగుతుందనిఆయన చెప్పారు.మరోవైపు, విశాఖ సీఐఐ సదస్సుకు 60 దేశాల నుంచి 4,975 మంది ప్రతినిధులు వచ్చారు. వీరిలో అంతర్జాతీయ ప్రతినిధులు 640 మంది ఉండగా, దేశీయ ప్రతినిధులు 1135 మంది ఉన్నారు. 185మంది దౌత్యవేత్తలతో పాటు ఎంవోయూల భాగస్వాములు 1,575 మంది సదస్సుకు హాజరయ్యారు. రెండ్రోజుల సదస్సులో 41 సెషన్లు నిర్వహించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు 24 ద్వైపాక్షిక సమావేశాల్లో, 16 వ్యాపారసమావేశాల్లో పాల్గొన్నారు.

# వన్ టైమ్ ఎంపీగానే గోరంట్ల



బి. ఎన్. రావు ( నగేష్ బూర్తి )సీనియర్ జర్నలిస్ట్ , విజయవాడ,7702262666

మాజీ పార్లమెంటు సభ్యుడు గోరంట్ల మాధవ్ కు ఈసారి కూడా వైసీపీలో టిక్కెట్ దొరకడం కష్టమే. ఆయన అనేక రకాలుగా ప్రయత్నాలు చేస్తున్నప్పటికీ పార్టీ అధికారంలోకి వస్తే రాజ్యసభ లేదా ఎమ్మెల్సీ వంటినామినేటెడ్ పోస్టు ఇస్తారేమో కానీ ప్రత్యక్ష ఎన్నికల్లో పోటీ చేసే అవకాశం మాత్రం ఇక దొరకదన్నది పార్టీ వర్గాల నుంచి అందుతున్న సమాచారం. ఆయన వరసగా అనేక వివాదాలలో కూరుకున్నందున, పార్టీకి ఇబ్బందికరంగా మారినందున ఆయనకు ఎక్కడా అసెంబ్లీ, పార్లమెంటు టిక్కెట్ ఇచ్చే అవకాశం లేదని తెలిసింది. గోరంట్ల మాధవ్ కు కూడా ఇటీవల కాలంలో చూచాయగా ఈ విషయాన్ని పార్టీ నాయకత్వం చెప్పినట్లుపెద్దయెత్తున ప్రచారం జరుగుతుంది. పోలీస్ శాఖలో సర్కిల్ ఇన్స్ పెక్టర్ గా, పోలీస్ అధికారుల సంఘం నేతగా ఉండి, ఉద్యోగానికి స్వచ్ఛంద పదవీ విరమణ చేసి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. జగన్ హిందూపురంలోబీసీలకు టిక్కెట్ ఇవ్వాలనుకుంటున్న జగన్ కు గోరంట్ల మంచి ఛాయిస్ గా కనిపించారు. దీంతో ఆయనకు ఈ ఎన్నికల్లో హిందూపురం పార్లమెంటు టిక్కెట్ దక్కింది. అన్నీ కలిసొచ్చి విజయం సాధించారు. గెలిచినతర్వాత అనేక వివాదాల్లో చిక్కుకున్నారు. పార్లమెంటు సభ్యుడిగా మంచి పేరు తెచ్చుకున్నా వ్యక్తిగత విషయాలతో ఆయన ఇబ్బంది పడ్డారు. పార్టీని కూడా ఇబ్బందుల్లోకి నెట్టారు. సామాజికవర్గం కోటాలో తనకు సీటుదక్కుతుందని ఇన్నాళ్లు భావించిన గోరంట్ల మాధవ్ కు మాత్రం ఇక ఆశ నెరవేరనట్లేనని అనుకోవాలి... వైసీపీకి నమ్మకమైన నేతగా గోరంట్ల మాధవ్ ఉన్నప్పటికీ ఆయన పత్తికొండ, రాప్తాడు నియోజకవర్గాలపై కన్నేశారు.కానీ అక్కడ అప్పటికే వైసీపీకి చెందిన బలమైన నేతలున్న కారణంగా వచ్చే ఎన్నికల్లోనూ ఎక్కడా గోరంట్ల మాధవ్ కు సీటు దక్కే అవకాశాలు లేవు. తమ నియోజకవర్గాల్లో వేలు పెడుతున్నారంటూ అక్కడి నేతలుగోరంట్ల మాధవ్ పై వైసీపీ నాయకత్వానికి ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. దీంతో వైసీపీ కి చెందిన ముఖ్య నాయకుడు ద్వారా జగన్ గోరంట్లకు సమాచారం పంపారని, ఆ నియోజకవర్గాల్లో వేలు పెట్టవద్దని సూచించినట్లుతెలిసింది. వైసీపీ అధికారంలోకి వస్తే నామినేట్ పదవి మాత్రం ఖచ్చితంగా దక్కుతుంది. అందుకే గోరంట్ల మాధవ్ ఇటీవల కాలంలో సైలెంట్ గా ఉన్నారు.

# సూర్యకు షాక్.. ముస్తాఖ్ అలీ ట్రోఫీలో ముంబై కెప్టెన్‌గా టీమిండియా ఆల్ రౌండర్



**హైదరాబాద్ పెన్ పవర్:** టీమిండియా కెప్టెన్ సూర్య కుమార్ యాదవ్ కు బిగ్ షాక్ తగిలింది. దేశవాళీ టీ20 టోర్నీసయ్యద్ ముస్తాఖ్ అలీ ట్రోఫీకి ముంబై కెప్టెన్ గా సూర్యకు స్క్వాడ్ లో ఛాన్స్ ఇచ్చినా కెప్టెన్ గా ఎంపిక చేయలేదు. నవంబర్ 26 నుంచి ప్రారంభం కానున్న ఈ మెగా టోర్నీకి శనివారం (నవంబర్ 22) 17 మంది సభ్యులతో కూడిన ముంబై స్క్వాడ్ ను ప్రకటించారు. ఆల్ రౌండర్ శార్దూల్ ఠాకూర్ కు కెప్టెన్సీ అప్పగించింది. ఇటీవలే రంజీ ట్రోఫీలో ముంబై కెప్టెన్ గా వ్యవహరించిన ఠాకూర్.. రానున్న ముస్తాఖ్ అలీ ట్రోఫీలోనూ ముంబై జట్టును

**నడిపించనున్నాడు.**

ప్లేయర్ గానే సూర్యను సెలక్ట్ చేయడానికి కారణం లేకపోలేదు. డిసెంబర్ లో సౌతాఫ్రికాతో ఇండియా ఐదు మ్యాచ్ ల టీ20 సిరీస్ ఆడనుంది. ఇండియాను సూర్య కెప్టెన్ కావడంతో సయ్యద్ ముస్తాఖ్ అలీ ట్రోఫీలో కొన్ని మ్యాటిక్ లకు అందుబాటులో ఉండే అవకాశం లేదు. ఈ కారణంగానే సూర్యను కేవలం ప్లేయర్ గానే సెలక్ట్ చేశారు. ఈ టోర్నీలో ముంబై తమ లీగ్ మ్యాచ్‌లను లక్నోలో అటల్ బిహారీ వాజ్‌పేయి ఎకానా క్రికెట్ స్టేడియంలో ఆడనుంది. శార్దూల్ ఠాకూర్ కెప్టెన్సీలోని ముంబై జట్టు డిఫెండింగ్ ఛాంపియన్‌లగా బరిలోకి దిగుతోంది. నవంబర్ 26న లక్నోలో జరిగే టోర్నమెంట్ ప్రారంభ మ్యాచ్‌లో ముంబై జట్టు రైల్వేస్‌తో తలపడుతుంది.

2024%-%25 సీజన్ లో టైటిల్ గెలిచిన ముంబై జట్టు పటిష్టంగా కనిపిస్తోంది. శివమ్ దుబే, అజింక్య రహానే , సర్ఫరాజ్

ఖాన్, ఆయుష్ మాత్రేలతో కూడిన బ్యాటింగ్ లైనప్ దుర్భేధ్యంగా కనిపిస్తుంది. ఈ జట్టులో హార్దిక్ తమోర్ తో పాటు వికెట్ కీపర్ గా అంగ్క్రిష్ రఘువంశీ తుషార్ దేశ్ పాండే, తనుష్ కోటియన్ సత్తా చాటడానికి సిద్ధంగా ఉన్నారు. ఈ సీజన్ రంజీ ట్రోఫీలో ఐదు మ్యాచ్‌ల్లో మూడు సెంచరీలు, ఒక అర్ధ సెంచరీతో 530 పరుగులు చేసిన సిద్ధేష్ లాడ్ కూడా స్క్వాడ్ లో ఉండడం ముంబై బలాన్ని మరింత పెంచుతుంది. ఎలైట్ డివిజన్ నవంబర్ 26 నుండి డిసెంబర్ 18 వరకు జరుగుతుంది. టోర్నీ మొదటి రౌండ్ లక్నో, హైదరాబాద్, అహ్మదాబాద్, కోల్‌కతాలో జరుగుతుంది. నాకౌట్ మ్యాచ్ లు ఇండోర్‌లో జరగనున్నాయి.

**ముస్తాఖ్ అలీ ట్రోఫీ ముంబై జట్టు:**

శార్దూల్ ఠాకూర్ (కెప్టెన్), హార్దిక్ తమోర్ (వికెట్ కీపర్), అంగ్క్రిష్ రఘువంశీ (వికెట్ కీపర్), అజింక్యా రహానే, ఆయుష్ మ్హాత్రే, సూర్యకుమార్ యాదవ్, సర్ఫరాజ్ ఖాన్, సిద్ధేష్ లాడ్, శివమ్ దూబే, సాయిరాజ్ పటేల్, ముషీర్ ఖాన్, సూర్యన్స్ షెగ్డే, అథర్వ అంకోల్కేర్,తనిష్ కొటియన్, షామ్స్ ములని, తుషార్ దేశ్ పాండే, ఇర్ఫాన్ ఉమైర్

# హెడ్ విధ్వంసక సెంచరీ.. 123 ఏళ్ల ప్రపంచ రికార్డు బద్దలు.. రెండు రోజుల్లోనే యాషెస్ టెస్ట్ ఖతం!

పెర్త్ టెస్టులో ట్రావిస్ హెడ్ విధ్వంసక సెంచరీ

నాలుగో ఇన్నింగ్స్‌లో వేగవంతమైన శతకంతో 123 ఏళ్ల రికార్డు బద్దలు

రెండు రోజుల్లోనే ముగిసిన మ్యాచ్.. ఇంగ్లండ్‌పై ఆసీస్ 8 వికెట్ల గెలుపు

మ్యాచ్‌లో 10 వికెట్లు పడగొట్టి కీలక పాత్ర పోషించిన మిచెల్ స్టార్క్



**హైదరాబాద్ పెన్ పవర్:** క్రికెట్ చరిత్రలో కొన్ని ఇన్నింగ్స్‌లు చిరస్థాయిగా నిలిచిపోతాయి. అలాంటి ఒక అద్భుతమైన, విధ్వంసకరమైన ఇన్నింగ్స్‌తో ఆస్ట్రేలియా ఓపెనర్ ట్రావిస్ హెడ్ ప్రపంచ రికార్డు సృష్టించాడు. ప్రతిష్ఠాత్మక యాషెస్ సిరీస్‌లో భాగంగా పెర్త్‌లో ఇంగ్లండ్‌తో జరిగిన తొలి టెస్టులో హెడ్ కేవలం 69 బంతుల్లోనే సెంచరీ సాధించి, 123 ఏళ్ల నాటి రికార్డును బద్దలు కొట్టాడు. హెడ్ అద్భుత ప్రదర్శనతో ఆస్ట్రేలియా కేవలం రెండు రోజుల్లోనే విజయం సాధించి, సిరీస్‌లో 1-0 ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. ఈ మ్యాచ్‌లో రెండో ఇన్నింగ్స్‌లో 205 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన ఆస్ట్రేలియాకు ట్రావిస్ హెడ్ ఆకాశమే హద్దుగా చెలరేగాడు. టీ20 తరహాలో బ్యాటింగ్ చేసిన హెడ్, కేవలం 83 బంతుల్లో 16 ఫోర్లు, 4 సిక్సర్లతో 123 పరుగులు చేశాడు. తొలి బంతి నుంచే ఇంగ్లండ్ బౌలర్లపై ఎదురుదాడికి దిగి 36 బంతుల్లో అర్ధశతకం, 69 బంతుల్లో శతకం పూర్తి చేశాడు. ఈ క్రమంలో టెస్ట్ క్రికెట్ చరిత్రలో నాలుగో ఇన్నింగ్స్‌లో అత్యంత వేగంగా సెంచరీ చేసిన ఆటగాడిగా ప్రపంచ రికార్డు నెలకొల్పాడు. ఇప్పటివరకు ఈ రికార్డు ఇంగ్లండ్ బ్యాటర్ గిల్బర్ట్ జెస్సోప్ పేరిట ఉండేది. జెస్సోప్ 1902లో ఆస్ట్రేలియాపై 76 బంతుల్లో సెంచరీ సాధించగా, 123 ఏళ్ల తర్వాత హెడ్ ఆ రికార్డును అధిగమించాడు.ఈ ఇన్నింగ్స్‌తో హెడ్ మరిన్ని ఘనతలు కూడా సాధించాడు. యాషెస్ సిరీస్ చరిత్రలో అత్యంత వేగవంతమైన సెంచరీ చేసిన రెండో ఆస్ట్రేలియా ఆటగాడిగా నిలిచాడు. 2006లో ఆడమ్ గిల్‌క్రిస్ట్ 57 బంతుల్లో సెంచరీ చేసి అగ్రస్థానంలో ఉన్నాడు. అలాగే, ఆస్ట్రేలియా గడ్డపై ఓపెనర్‌గా అత్యంత వేగంగా సెంచరీ చేసిన డేవిడ్ వార్నర్ (69 బంతులు, 2012) రికార్డును హెడ్ సమం చేశాడు.ఈ మ్యాచ్ ఆద్యంతం నాటకీయ పరిణామాల మధ్య సాగింది. తొలి ఇన్నింగ్స్‌లో ఆస్ట్రేలియాపై 40 పరుగుల ఆధిక్యం సాధించిన ఇంగ్లండ్, రెండో ఇన్నింగ్స్‌లో 65/1తో పటిష్టంగా కనిపించింది. కానీ అక్కడి నుంచి ఆ జట్టు పేకమేడలా కూలిపోయింది. మిచెల్ స్టార్క్ నిప్పులు చెరిగే బంతులకు తోడు, ఇంగ్లండ్ బ్యాటర్ల పేలవ షాట్లతో కేవలం 11 ఓవర్ల వ్యవధిలో 39 పరుగులకే 6 వికెట్లు కోల్పోయింది. ముఖ్యంగా ఆరు బంతుల వ్యవధిలో ఓల్లీ పోప్, హ్యారీ బ్రూక్, జో రూట్‌లను ఔట్ చేసి ఆసీస్ మ్యాచ్‌పై పట్టు సాధించింది. దీంతో ఇంగ్లండ్ రెండో ఇన్నింగ్స్‌లో 164 పరుగులకే ఆలౌట్ అయింది. అనంతరం 205 పరుగుల విజయలక్ష్యాన్ని ఆసీస్ 28.2 ఓవర్లలో 2 వికెట్లకు ఛేదించింది. మ్యాచ్ మొత్తమ్మీద 10 వికెట్లు పడగొట్టిన మిచెల్ స్టార్క్ ఆసీస్ విజయంలో కీలక పాత్ర పోషించాడు.ఈ మ్యాచ్ కేవలం 847 బంతుల్లోనే ముగియడం విశేషం. యాషెస్ చరిత్రలో అత్యంత తక్కువ బంతుల్లో ముగిసిన మూడో టెస్టుగా ఇది రికార్డులకెక్కింది. ట్రావిస్ హెడ్ అసాధారణ ఇన్నింగ్స్‌తో సిరీస్‌ను ఘనంగా ప్రారంభించిన ఆస్ట్రేలియా, డిసెంబర్ 4న బ్రిస్బేన్‌లో జరిగే డే-నైట్ టెస్టుకు రెట్టించిన ఉత్సాహంతో సిద్ధమవుతోంది.

# కంగనా తరహాలో కీర్తి సురేష్ బిగ్ డ్రీమ్

సాధారణంగా హీరోయిన్ల కెరీర్ గ్రాఫ్ పెళ్లి తర్వాత స్లో అవుతుందని అంటారు. కానీ కీర్తి సురేష్ మాత్రం ఆ సెంటిమెంట్ కి చెక్ పెట్టేసింది. పెళ్లి తర్వాత ఆమె మరింత జోరుగా దూసుకెళ్తోంది. 'రివాల్వర్ రీటా' ప్రమోషన్స్ లో బిజీగా ఉన్న కీర్తి, తన మనసులో ఉన్న ఒక 'బిగ్ డ్రీమ్' గురించి ఓపెన్ అయ్యింది. అది కేవలం నటనకు సంబంధించినది కాదు, సినిమా మేకింగ్ కి సంబంధించిన ఒక పెద్ద కల. ఇప్పుడు ఇదే ఇండస్ట్రీలో హాట్ టాపిక్ గా మారింది. కీర్తి సురేష్ తన



ఇంటర్వ్యూలో క్యాజువల్ గా చెప్పిన ఒక మాట ఏమిటంటే.. ఆమె సొంతంగా ఒక స్క్రిప్ట్ రాసుకుంటోందట. అవును, కీర్తికి డైరెక్షన్ చేయాలనే ఆసక్తి ఎప్పటి నుంచో ఉందట. కేవలం గ్లామర్ డాల్ గా మిగిలిపోకుండా, ఒక క్రియేటర్ గా తనను తాను ప్రూవ్ చేసుకోవాలని ఆమె బలంగా కోరుకుంటోంది. ఇది నిజమైతే, కంగనా రనౌత్ లాగా కీర్తి కూడా 'లేడీ డైరెక్టర్' గా మెగాఫోన్ పట్టుకునే రోజు ఎంతో దూరంలో లేదు. యాక్టింగ్ చేస్తూనే డైరెక్షన్ చేయడం అనేది కత్తి మీద సాము లాంటిది. అజయ్ దేవగన్, కంగనా లాంటి కొద్దిమంది మాత్రమే ఈ ఫీట్ ని సక్సెస్ ఫుల్ గా చేయగలిగారు. ఇప్పుడు కీర్తి కూడా ఆ లిస్ట్ లో చేరాలని చూస్తోంది. ఇది ఆమెలోని మల్టీ టాలెంటెడ్ యాంగిల్ ని చూపిస్తోంది. 'మహానటి'గా సావిత్రి గారి బయోపిక్ లో నటించి మెప్పించిన కీర్తి, ఇప్పుడు నిజ జీవితంలో కూడా సావిత్రి గారిలా డైరెక్షన్ వైపు అడుగులు వేస్తుండటం యాదృచ్ఛికమే అయినా ఆసక్తికరంగా ఉంది. ఇక పర్సనల్ లైఫ్ గురించి మాట్లాడుతూ, తన భర్త సినిమాలకు దూరంగా ఉంటారని క్లారిటీ ఇచ్చింది. "ఆయన సినిమాల జోలికే రారు, నాతో నటించే ప్రసక్తే లేదు" అని నవ్వేసింది. ఇది చూస్తుంటే కీర్తి తన ప్రొఫెషనల్ లైఫ్ ని, పర్సనల్ లైఫ్ ని ఎంత బ్యాలెన్స్ గా మైంటైన్ చేస్తుందో అర్థమవుతోంది. భర్త సపోర్ట్ ఉన్నా, తన కెరీర్ ని తన సొంత కాళ్ల మీదే నిలబెట్టుకోవాలనే తపన ఆమెలో కనిపిస్తోంది. మరోవైపు మహిళల భద్రత గురించి కీర్తి చేసిన వ్యాఖ్యలు ఆలోచింపజేసేలా ఉన్నాయి. తనకి, సమంతకి సంబంధించిన ఒక డీప్ ఫేక్ వీడియో క్లిప్ చూసి తాను ఎంతలా భయపడ్డానో చెప్పుకొచ్చింది. టెక్నాలజీ పెరుగుతున్న కొద్దీ, సెలబ్రిటీలకే కాదు సామాన్య మహిళలకు కూడా రక్షణ కరువవుతోందని ఆమె ఆవేదన వ్యక్తం చేసింది. విదేశాల్లో ఉన్నంత కఠిన చట్టాలు ఇక్కడ కూడా రావాలని ఆమె కోరుకుంది.



**టీల్ చీర మరియు వెల్వెట్ బ్లౌజ్‌లో ఆర్తి చికరా మెరిసిపోయింది**



**మాళవిక మోహనన్: ప్రతి ఫ్రేమ్‌లో చక్కదనం**

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, ONGOLE MANDAL, prakasam district, Andhrapradesh-523001. and published at 38/291-6, Sreerama nagar colony, Near Central prison, KADAPA CITY, KADAPA DISTRICT, ANDHRAPRADESH-516002, Editor : GANTYADA APPARAO Mobile : 9059465965, RNI : APTEL/25/A2231, editorpenpower@gmail.com